# శ్రీరామచంద్రుని ధర్మ బాణం

శ్రీ రామనవమి ప్రత్యేక వ్యాసం - ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

ధర్మగ్లాని సంభవించినప్పుడల్లా దుర్మార్గులను శిక్షించి, 'మన'వంటి సన్మార్గులను రక్షిస్తానని వాగ్దానం చేసినందుకు భగవంతుడికి అవతరించక తప్పలేదు. దేశమంతటా రామాలయాలలో రామాయణ కథాగానాలలో మన హృదయాలు కృతజ్ఞతతో పరవళ్ళు త్రొక్కుతాయి. కాని రాముడు, ఆయన కథద్వారా వాల్మీకి మహర్షీ మనకు ధర్మం తెలపాలని, మనం తరించాలనీ ఆశించారు, అలా చేసిననాడే మనం జరుపుకొనే రామనవమి ఆ ధర్మ విగ్రహుడికి, మహర్షికి సంతోషాన్నిస్తుంది.

లోకహితంకోసం తపస్సు, యజ్ఞము, శిష్య శిక్షణా చేసే ఋషులను రక్షించి ప్రోత్సహించడం రాజధర్మం. కాని పుత్రవ్యామోహంతో యాగ రక్షణకు విశ్వామిత్రునితో రాముని పంపడానికి దశరధుడిష్టపడలేదు. తనబిడ్డను బ్రహ్మర్షి విశ్వామిత్రుడు రక్షించగలడన్న విశ్వాసాన్ని గూడ అతడి మమకారం కప్పేసింది. చివరికి వశిష్టుల ఆదేశానికి తలవొగ్గిమాత్రమే రాముణ్ణి పంపాడు. బ్రహ్మవేత్తలైన గురువుల ఆదేశానికి తలవొగ్గడమే మన కర్తవ్యమని రాముడు గమనించాడు.

ఈ చివరివాక్యం మినహా మిగిలిన వాక్యాలన్నీ మనకూ అనుభవమే. నిత్యమూ రాముణ్ణో, సాయిరాముణ్ణో "నీవే తల్లివి: తండ్రివి: నా సర్వస్వమూ" అని స్తుతిస్తాము. మన యింద్రియాలను, బుద్ధులను, తను మనధనాలను, స్వజనాన్ని ఆయన సేవకు అర్పించే శ్లోకం చదువుతాము. అంతేకాదు రాముడు రాజభవనసుఖాన్ని త్యజించి యాగరక్షణ కోసం అడవికి వెళ్ళాడని, దశరధుడతణ్ణి కేవలం గుర్వాదేశంవల్లనే పంపాడని, ప్రహ్లాదుడు తనవారందరినీ కాదనుకొని శ్రీహరినే అర్చించాడని చదవి ఆనందభాష్పాలు కారుస్తాము.

కాని ఆచరణకొస్తేనో? తనబిడ్డ శ్రీహరిసేవ చేయనిష్టపడని హిరణ్యకశిపుణ్ని చీదరించుకొంటూగూడ మనమూ, మన బిడ్డలూ రోజులో వ్యర్ధంగా గడిపే సమయాన్ని గూడ స్వామిసేవకు వినియోగించడానికి సిద్ధంగా వుండము. ఫ్యాన్‌గాలిమేస్తూ సోఫాలో కూర్చుని హాయిగా సద్గ్రంధాలు చదవి మనమూ వారిలా మహాత్ములవాలనీ, అవుతామని ఆశిస్తాము. ఇహపర సుఖాలను 'ఆయన' మనకు ప్రసాదించలేదని ఒక్కొక్కసారి సతాయిస్తాము. ఎక్కడో మత కలహాలో, గాలివానలో వస్తే అక్కడి మనవారికి 'ఆయన' బంట్రోతై కాపలా కాయాలి. మనంగాని, మనవారుగాని స్వామివారిసేవలో సహకరించవలసివస్తే 'వాళ్ళంతా వున్నారుగదా! మనం వెళ్ళక పోతేనేమి?' అనుకుంటాము.

సాయి తన గురువును 12 సం॥లు సేవించారు. 12 సం॥లు వేపాకు తిని భూగృహంలో తపస్సు చేసారు. 60 సం॥లు శిరిడీలో ఉదయం 5గంటలనుంచీ రాత్రి 10 గంటలదాకా వచ్చేవారందరినీ ఆదరించారు. రాత్రి సమయాలలో గూడ నిద్ర ఎఱుగక భక్తులను కాచారు. మనమో! మహా సమాధి తర్వాత గూడ ఒక్కక్షణమైనా ఆయనకు విశ్రాంతినివ్వం. మనబ్బాయికి జ్వరంగావున్నదని జాబు వచ్చింది; ఆఫీసులో మనకు వత్తిడి వచ్చింది; లేక ప్రమోషన్ రాలేదు. అబ్బాయి మనమాట వినటంలేదు. ఇక సాయికి కంటిమీద కునుకుండకుండా గోరుచుట్టులా నలిపేస్తాము. ఔను, మనం రోజు అగరొత్తి పెట్టటంలా? అప్పుడప్పుడూ టెంకాయ కొట్టడంలా? రాముడుగాని, సాయిగాని - వారు ఆజన్మసిద్ధమైన సహనంతో మనను సహిస్తున్నారు గనుక కొలుస్తున్నాము.

కనీసం మనకూ మనవారికి పనికిరాని విరామ సమయంలోనైనా ఆయన సేవ చేయడమో, చేసేవారితో సహకరించడమో నేరుస్తే సాయి - రామ అవతార కార్యము, రానున్న రామనవమి ఎంతైనా సార్ధకమైనట్లే. రామ బాణానికి బలమున్నట్లే.

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

OFFICIAL ORGAN OF MASTER UNIVERSAL SAI TRUST




ఛీఫ్ ఎడిటర్: శ్రీ పోలూరి శ్రీనివాసరావు బి.ఎ.ఎల్.ఎల్.బి
ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: శ్రీ జె.శ్రీనివాసరావు, ఎమ్.ఎస్.సి

సంపుటి: 27 మార్చి 2010 సంచిక: 11

స్వాధ్యాయ ప్రవచనాల ద్వారా వ్యక్తి నుండి వ్యక్తికి ప్రతి కుటుంబంలోను ఇతరులతోను అభ్యుదయ శ్రేయాసాలకు కారణం కాగల విజ్ఞానాన్ని అందించుకుంటూ పోవడమే సుస్థిరమైన సామాజిక శ్రేయస్సును సమకూర్చగలదు. స్వాధ్యాయ ప్రవచనాలను వ్యక్తులు శ్రద్ధతో నిర్వహించకపోవడం వలనే ధర్మచ్యుతి సంభవిస్తుంది. తిరిగి వాటిని అనుష్టించడం వలననే ధర్మ వికాసం సంభవిస్తుంది. ఇదే మానవ జీవిత ప్రయోజనం. సౌభ్రాతృత్వంతో ఒకరినొకరూ , ఎవరికివారు ఈ సత్యాన్ని గుర్తు చేసుకొనడమే కర్తవ్యం.సమాజంలో ధర్మానికి మూలమైన విద్యను దానం చేయడం అన్ని దానాల్లోకీ సర్వశ్రేష్టమని శాస్త్రం.

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు. శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్‌కు ఎటువంటి బాధ్యతా లేదు.

## విషయసూచిక

1. శ్రీ రామచంద్రుని ధర్మబాణం 1
2. సీత 3
3. శ్రీ సాయి సచ్చరిత్ర 10
4. శ్రీ దత్తలీలామృతం -సీరియల్ 13
5. వార్తాలాపము - సీరియల్ 16
6. శ్రీ సిద్ధారూఢ స్వామి 18
7. శ్రీ భరద్వాజ లేఖామృతము 20
8. శ్రీ అక్కల్‌కోట మహారాజ్ 22
9. సాయిబాబా మంత్రోపదేశం 27
10.సాయి చర్యలు-ధర్మానికి దీపాలు 29

## చందా వివరములు

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10-00 |
| సంవత్సర చందా | : రూ. 100-00 |
| జీవిత చందా | : రూ. 1,116-00 |
| (సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును) | |
| (20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది) | |
| రాజపోషకులు | : రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000-00 |

## చిరునామా

**శ్రీ మాస్టర్ యూనివర్సల్ సాయి ట్రస్ట్,**
**మంగమూరు డొంక, ఒంగోలు-2.**
**ఫోన్ నెం: 08592 - 233271**
website: www.saibharadwaja.org

“సూర్య చంద్రాదులున్నంత వారకు నా అవతార కార్యము కొనసాగుతూనే వుంటుంది”.

# సీత

## పూజ్య ఆచార్య భరద్వాజ స్వహస్తాలతో వ్రాసిన అముద్రిత వ్యాసం

వాల్మీకి రామాయణంలో సీత అయోనిజ అని చెప్పారు. మహా పతివ్రత అని చెప్పారు. సీతాదేవి విశిష్ఠత చెప్పబడ్డది. పతిభక్తికి ఉదాహరణగా ఆమెను చెప్పుకుంటాము.

బాలకాండలో సీత తనకు నాగటిచాలులో దొరకటం సంగతి జనకుడు బాలకాండలో చెప్పటంకంటే విశేషంగా తిరిగి అయోధ్యకాండ పర్వంలో 30వ సర్గవరకూ జరగలేదు.

బాలకాండలో మనకు తెలిసేది ఆమె అయోనిజ అని, జనకుడు యజ్ఞం చేయడానికి భూమిని దున్నుచుండగ నాగటిచాలులో దొరికింది గనుక ఆమెకు 'సీత' అనిపేరు పెట్టినట్టు. ఈ వృత్తాంతము 66వ సర్గలో 13వ శ్లోకంలో వుంది. అంతకంటే అందులో వివరంలేదు.

ఈ వృత్తాంతము యీనాటి మనకు విడ్డూరంగాను నమ్మరానిదిగానూ వుంటుంది. ఇది నూటికి నూరుపాళ్ళు అట్లాగే జరిగివుంటుంది అనాలంటే మనము అలాంటి సందర్భం ఒక్కటన్నా చూస్తేగాని నమ్మలేము. అయితే అంతకంటే చారిత్రాత్మకమైన అనేకమంది మహాత్ముల జీవితంలోనూ అటువంటి సన్నివేశాలనే మనముచూడవచ్చు.

నీరూ అనే మొహమ్మదీయునికి కబీరు ఒక చెరువులోని తామరాకుల్లో దొరికాడట. అయితే ఆ విషయంలో ఎవరో ఆ బిడ్డను ఏవో తదనుగుణమైన పరిస్థితులలో నీరూ రాబోయేముందే అక్కడ వదిలేసి వుండవచ్చునన్నది ఒక అవకాశం వుంది. ఏసుక్రీస్తు జననం కేవలం భగవత్సంకల్పితంవల్ల మరియమ్మ వివాహానికి పూర్వమే సద్యఃగర్భాన్ని ధరించినట్టు బైబిల్ చెబుతుంది. ఋషి, దేవతాదులవరంతో సద్యఃగర్భం సాధ్యమని మన ప్రాచీన గాథలలో వుంది. 1856 నుండి 1879వరకూ మహారాష్ట్రదేశంలో శ్రీ దత్తాత్రేయుని అవతారంగా కొలవబడిన శ్రీ అక్కల్‌కోట స్వామి సంతానంలేని ఒక గృహిణికి వయసుమీరి ముట్లుడిగిన తర్వాతగూడా ఆమెకు సంతానం కలిగేలా ఆశీర్వదించారు. అంతకు కొంచెముందు శ్రీ దత్తమూర్తి అవతారంగా కొలవబడిన మాణిక్యప్రభువుకూడా అట్లానే ముట్లుడిగిన ఒక స్త్రీ సంతానార్థం ఆయన ఆశీర్వచనాన్ని కోరింది. అదేసమయంలో మరొక బ్రహ్మచారిణి భక్తురాలు ముట్టుఅయి స్వామి దర్శనం చేసుకోలేనందుకు తనకు జీవితంలో ఆ బాధ ఎప్పుడు తొలగిపోతుందా అని వాపోతూంటే ఆమెను పిలిచి, ఆమె అనుమతితో ముట్లను సంతానం కోరే గృహిణికి సంక్రమింపచేసి, బ్రహ్మచారిణిని వాటినుండి విముక్తురాలుగా చేసారు. ఆ తర్వాత సంతానం కోరిన గృహిణికి సంతానం కలిగారు. ఇటువంటి అద్భుతాలు జరిగేటప్పుడు బహుశః సీత విషయంలోకూడా యిదీ సాధ్యమే అయివుండవచ్చేమో!

ఇటువంటి విచిత్ర వృత్తాంతం యితర దేశాలలోని కొందరి మహాత్ముల విషయంలో కూడా చెప్పబడివున్నది. పద్మసంభవుడని ఒక సిద్ధపురుషుడు 8వ శతాబ్దంలో ఉత్తరహిందూదేశంలో 'ఉడ్యాన' లేక 'ఉద్యాన' నగరంలో ఇంద్రబోధి అనే రాజుయొక్క ప్రార్థనల ఫలితంగా 'ధనకోశ' సరోవరంలో ఒక పెద్ద పద్మంలో దొరికినట్లు, ఆ తర్వాత ఆయన బౌద్ధమతంలో పెద్ద తంత్రయోగియైనారని, ఆయనను క్రీ.శ. 8వ శతాబ్దాంతరంలో ఆయన మహిమను వినిన టిబెట్ రాజు థీస్రోంగ్ దెస్తాన్ (క్రీ.శ. 740 నుంచి 786) తమ దేశంలో బౌద్ధమతస్థాపన

చేయమని ఆహ్వానించాడని, ఆయన భారత, బర్మా, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్ మొదలైన దేశాలలో పర్యటించారనీ టిబెట్‌దేశపు బౌద్ధగ్రంథాలలో వ్రాసివుండడమేకాక ఆయనపై ఆధ్యాత్మిక గ్రంథాలు కూడా నేటికీ వున్నాయి.

వీటన్నింటి దృష్ట్యాచూస్తే బహుశ: ప్రకృతిలోను ప్రపంచంలోనూ మనకు నిత్యానుభవాలలో గోచరించేటటువంటి ధర్మాలకతీతమైన ధర్మాలు మనకు తెలియనివున్నాయని, యిప్పటి మన అపరిపూర్ణ విజ్ఞానం దృష్ట్యా అద్భుతంగా లేక అసంభవముగాతోచే అనేక ఘనకార్యాలను చేయడం సాధ్యం అయివుండొచ్చనీ తలచవచ్చు.

ఇంక సీత పాత్రకొద్దాము. మనకి మొదటిసారిగా వాల్మీకీ రామాయణంలో సీత కొంత విపులంగా మాట్లాడడము, తద్వారా ఆమె పాత్రను, మనస్తత్వాన్ని అర్థంచేసుకోవడానికవకాశం అయోధ్యకాండ 30వ సర్గలో కలుగుతుంది. యువరాజ పట్టాభిషేకం రామునికి చేస్తారని ప్రజలకు చాటి, అన్ని ఏర్పాట్లుచేసి, ఆ ఉదయం యింక ఆ పుణ్యకార్యం పూర్తిచేయబోతుంటే మంధర ప్రేరణవల్ల కైక దశరథుడితో భరతుడికి పట్టాభిషేకంచేసి రాముణ్ణి వనవాసానికి 14 సం॥లు పంపమని పట్టుబట్టినందువల్ల రాముణ్ణి పిలిచి ఆమాట వారిద్దరూ చెబుతారు. రాముడికి ఆ సమయంములో దశరథుని నుంచి పిలుపు వస్తే పాపం సీత పట్టాభిషేకం కోసం అనుకొని స్వస్తివాక్యాలతో రాముని పంపుతుంది. కాని కాస్సేపట్లో రాముడు ఆమె దగ్గరకొస్తాడు. అరణ్యవాసం చేయమని కైక, దశరథులు చెప్పినప్పుడు ఏమీ చలించక పితృవాక్యపాలన అనే తన మూలధర్మానుసారం నిగ్రహబుద్ధితో తిరిగి తన ఇంటికి బయలుదేరుతాడు గాని సీతను చూచేసరికి ఆ పట్టాభిషేకాన్ని ఊహించుకుంటున్న సీతకు యీ భయంకరవార్త చెప్పవలసి వచ్చినందుకు, ఆమెను అయోధ్యలోవుంచి తానొక్కడు అరణ్యానికెళ్ళాలనే తన నిశ్చయంవల్ల ఆమెకు ఎడబాటు కలిగించవచ్చినందుకు కలిగిన దు:ఖాన్ని ఆమెను చూడగానే ఆపుకోలేకపోయాడట. అప్పుడు సీత అతని ముఖం -- వివర్ణమై వుండడంచూచి కళ్ళనీళ్ళతో వివరం అడగగానే తనకు కైక, దశరథులు అరణ్యంలో తపస్విగా 14 సం॥లుండమని వరం యిచ్చినట్టు ఒక్కమాటలో చెబుతాడు.

ఆ మాటవిన్న సీత ఎందుకు రాముడు అరణ్యానికి వెళ్ళాలి? అతను అగ్రజుడైనందువల్ల రాజ్యం అతనికే రావాలిగదా? మొదలైన ప్రశ్నలుగాని, కౌసల్యా దశరథులపట్ల కించిత్తైనా కోపంగాని ఒక్క మాటలోకూడా ధరించక, పితృవాక్యపాలన రామునికెంతటి దృఢవ్రతమో తెలిసిన సీత తననుకూడా అరణ్యానికి తీసుకువెళ్ళమన్న ఒక్క విషయమే మాట్లాడుతుంది.

సరిగ్గా అంతకుకొద్ది సర్గలముందు కైక దశరథుడితో ఈ దారుణమైన వరాన్ని ఎలా ఆయననుంచి కోరుకుందో చూస్తాం. ఆ దృశ్యంలోని కైక తన భర్త పట్ల వహించిన వైఖరికీ, సీత రామునిపట్ల వహించిన వైఖరికీ వ్యత్యాసం గమనిస్తే గాని సీతపాత్ర అర్థంకాదు.

కైక సహజంగా క్రూరురాలు కాకపోయినా దశరథుడి పూర్వ పాపము, రాముని అవతారవిధి కలిపి మంధర రూపంలో ఆమె మనస్సును పెడదారిబట్టించినట్లు వాల్మీకి దశరథుడి మాటలలోనే సూచించాడు.

కైక మొదట మంధరతో అన్నమాటలవల్ల రాముడు ఆమెను ఎంతబాగా ప్రేమిస్తాడో ఆమెకు తెలిసివున్నట్లు తేలుతుంది. అయినా భరతుడు, అతని సంతతి రాజులు కావాలన్న కోరిక ఆమె మనస్సులో అతనిమీద ద్వేషం, అతని మంచితనంమీద అవిశ్వాసం ఏర్పడ్డట్లు సూచిస్తాయి. దశరథుడితో ఆమె అనే మాటలు ఎప్పుడూ ఆమెకు ఎదురు చెప్పక ఆమెను తల్లిగా ప్రేమిస్తున్న రాముణ్ణి ఆమె అంతగా ద్వేషిస్తుంటే రాముడేగాక, సీతకూడా కైక,

దశరథులవల్ల ధర్మత: రాజ్యార్హతకల తన భర్తకు నిష్కారణంగా పట్టాభిషేకం చెయ్యకపోవడమేకాక, అతన్ని 14 సం॥లు అరణ్యానికి పంపుతున్నారని తెలిసినా వారిని పల్లెత్తుమాటకూడా అనదు. చివరికి లక్ష్మణుడు, కౌసల్య రాముడి హక్కు గురించి పలికారు. మొదట దశరథుడు కూడా కైకతో అన్నాడుగాని, ఆమె అనలేదు.

రాముడు వనవాసానికెడితే తాను బ్రతకనని ముమ్మారు పాదాలంటి దశరథుడు కైకతో చెప్పి ఆమె విధవకావలసి వుంటుందన్నా, ఆమె ఆ విషయాన్ని కొంచెం గూడా లెక్కచేయదు. ఆమె పుత్రుడికి రాజ్యం రావాలన్న కోరిక ధర్మపత్నిగా తన ధర్మాన్ని, తన అయిదవతనాన్ని కూడా చాలా హీనంగా చూచేలా చేసింది. కాని సీత రాముడి నోటినుంచి వనవాసం సంగతి విన్న క్షణంనుంచి అతనితో తాను వెళ్ళడం గురించే మాట్లాడుతుంది. రాముడు ఆమె అయోధ్యలోనే వుండి వృద్ధుడైన దశరథుణ్ణి, కైకను పుత్రవియోగ దు:ఖంనుండి ఊరడించమని చెప్పినా సీత అనేది ఒక్కటే - తల్లి, తండ్రి, కొడుకులు, తోబుట్టువులు- అందరూ ఎవరి కర్మను వారనుభవించేవారేననీ, ఒక్క భార్యమాత్రమే తన భర్త ధర్మ, కర్మలలో పాల్పంచుకునేదనీ చెబుతుంది. రాముడు ఎంత భయంకరంగా అరణ్యాన్ని వర్ణించినా "గుణానిత్యేవ తానే విద్ధి తవస్నేహ పురస్కృతానే'' అంటుంది (సర్గ 29: శ్లో2). అంటే "నీ సాన్నిధ్యంవల్ల అవన్నీకూడా భయానకాలుకాక సుగుణాలే అవుతాయి'' అని. అంతేకాక తన మాటనిలా 9వ శ్లోకంలో బలపరుస్తుంది.

"లక్షణిభ్యో ద్విజాతీభ్య: శ్రుత్వాహం వచనం పురా।
వనవాసకృతోత్సాహానిత్యమేవ మహాబల॥

తాత్పర్యం: "ముందు తపస్సుల వర్ణనలను విననప్పుడే నాకు వనవాసము చేయాలన్న అభిలాష కల్గింది'' అని. అలానే తనకు రామునియందున్న భావాన్నిలా చెబుతుంది:

"భక్తాం పతివ్రతాం దీనాం మాం సమాం సుఖదు:ఖయో ।
సేతుమర్హసి కాకూత్స్థ సమాన సుఖదు:ఖనీం ॥

తాత్పర్యం: "భక్తురాలిని, పతివ్రతను, దీనురాలను, సుఖదు:ఖాలను (పతివ్రతా ధర్మ నిర్వహణలో) సమంగా చూచేదానిని, ఆ విధంగా సుఖదు:ఖాలను సమానంగా ఎంచగల నన్ను మీతోకూడా (అరణ్యానికి) తీసుకువెళ్ళుట యుక్తము''. (శ్లో:20)

ఆ ధర్మాన్ని తానెంతగా పాటించుటవల్ల ఆమె రాముడితో అడవికి తీసుకుపోబడడానికర్హురాలో మరో శ్లోకం (శ్లో:7, సర్గ:30)లో చెబుతుంది.

"నత్వహం మనసాప్యన్యం దష్టాస్మిత్వదృతే నఘ ।
త్వయా రాఘవ గచ్ఛేయం యధాన్యాకలపాంసినీ ॥

తాత్పర్యం:

ఈ విషయంలో సరిగ్గా సీత శ్రీరాముడికి తగియుండడం గుర్తించవలసిన విషయం. రాముడు పితృవాక్యపాలనా అనే ధర్మాన్ననుసరించి లక్ష్మణాదులు తనను తన హక్కుకోసం నిలబడమని ఎన్ని ధర్మయుక్తమైన యోచనలను చెప్పినా రాజభవనములోని వైభవాన్ని కాలిగోటితో తోసేసి అరణ్యావాసానికి సంసిద్ధుడవుతాడు. సీతకూడా తన పాతివ్రత్య ధర్మపాలనలో రాముడెంతచెప్పినా "పతి వాక్యపాలన'' అన్న మిషతోకూడా రాజభవన

సౌఖ్యాలకంటిపెట్టుకొనక వాటిని తృణీకరించి అతనిననుసరిస్తుంది. పతివ్రతగా పతియందు తనకున్న ధర్మం తక్కిన అన్ని యోచనలను విడిచేస్తుంది. ఈ విషయంలో రాజ్యకాంక్ష పుత్రవాత్సల్యమువల్ల తన భర్తపట్ల ధర్మాన్ని త్యజించిన కైకకంటే ఎంత భిన్నంగా, ఉన్నతంగా సీత వర్తించిందో గమనించదగినది. అక్కడ తన జీవితాన్ని కోల్పోవలసివస్తుందని దశరథుడు ప్రాధేయపడినా లెక్కచేయక తనకిచ్చిన మాట చెల్లించకపోతే విషం తాగి చస్తానని కైక అంటుంది. కాని సీత అలాకాదు.

"యదిమాం దు:ఖితామేవం వనం నేతుం నచేచ్ఛసి ।

విషమగ్నిం జలం వాహమాస్థాస్యే మృత్యుకారాణాత్ ॥

(30:21)

తాత్పర్యం: "(మీతోకూడా వస్తానని) దు:ఖిస్తున్న నన్ను మీతో వనానికి తీసుకువెళ్ళడానికి యిచ్ఛగించరేని నేను విషంతోగాని, అన్నంతోగాని, జలంతోగాని మృతిపొందుతాను'' అంటుంది. ఎంత భేదం వీరిద్దరికీ!

అయితే భర్త వాక్యపాలన అనే ధర్మం దృష్ట్యా సీత రాముడు చెప్పగానే అయోధ్యలో వుండడానికి అంగీకరించకపోవడం అధర్మంకదా! అన్న ప్రశ్న రావచ్చు. జాగ్రత్తగా చూస్తే ఆ ప్రశ్న ఎందుకు మన మనస్సులో ఉద్భవిస్తుందో చూస్తేగాని తెలియదు. కావ్యాన్ని చదివేటప్పుడు పాఠకుడు పాత్రస్థానంలో తననూహించుకోవడమే సహృదయత్వం. అలా సీతస్థానంలో మననూహించుకుంటే, ఆమెనైతికబలం, మనోధైర్యం ఎలాంటివంటే, మనకు ఏది సుఖాన్నిస్తుందో దాన్ని ధర్మం అని అన్వయించుకోచూస్తాము. అందుకే మన యిష్టానికి ధర్మం ప్రతికూలంగా వున్నప్పుడు "ఈ రోజుల్లో ధర్మం గిర్మం అంటే ఏమీ లాభంలేదు'' అని సరిపెట్టుకుంటాం. సీత అలాచేయకపోవడం చదివినప్పుడు మన అహానికి దెబ్బతగిలి, ఒకరకమైన అసూయవల్ల దోషారోపణచేయాలని తప్పు ఎంచాలని కోరుతుంది మనస్సు! అట్లాకాకపోతే మన జీవితాలు ధర్మపరాయణతకు అంకితమయ్యేవేగా! అసలు రామాయణం నిజంగా జరిగింది కాదని మనం దృఢంగా విశ్వసించటంలోని ఆంతర్యంకూడా యిదే!!

ఇక ఆ ప్రశ్నకు సమాధానం:

ధర్మం యొక్క రూపంలో రెండు విభాగాలున్నాయి. ఒకటి - సాంఘిక జీవితంలో వ్యక్తియొక్క ప్రవర్తనము. తక్కిన వ్యక్తులయొక్కగాని, సంఘంయొక్క శ్రేయస్సుకు భౌతికంగాగాని, మానసికంగాగాని, నైతికంగాగాని ప్రమాదం వుండకుండా వుండడానికి మనిషి పాటించవలసిన ధర్మం; దీనిలో భాగమే సాధ్యమైనంతవరకూ తనకూ యితరులకు కూడా శ్రేయోదాయకమైన పద్ధతిననుసరించడం. ఇది లౌకిక ధర్మం. ఇది ప్రతివానియొక్క విధి లేక శాసనం అయి వున్నది.

ఇదికాక పరధర్మమింకొకటి వున్నది. అది కేవలం వ్యక్తియొక్క యిచ్ఛ, సామర్థ్యాలమీద ఆధారపడి లౌకిక ధర్మానికంటే ఎన్నోరెట్లు తన స్వార్థాన్ని త్యాగంచేగలగడం. తన ప్రాణరక్షణ కత్యావశ్యకమైనప్పుడు, ఘర్షణ తప్పనప్పుడు - యుద్ధంలోలాగ - శత్రువును చంపడం ధర్మబద్ధమే. కాని ఒకానొక ధర్మమూర్తి ఇతరులకు ప్రాణదానం చేయడంకోసం తనంతటతానే తన ప్రాణాన్ని త్యజించగల్గితే అది పరమధర్మమవుతుంది. ఇది బలవంతాన ఒకరిచేత ఇంకొకరు చెప్పిచేయించేదికాదు. ఎవరికివాడే తమ పవిత్రతచేత, నైతికబలంచేత, త్రికరణశు

ద్ధిగాచేసేది. ఈ రెండవ ధర్మం సామాన్యులకుకూడా ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క సందర్భంలో సాధ్యం అయితే కావచ్చుకాని దాన్నే తన వ్రతంగా నిష్టగా, నిత్యజీవిత ధర్మంగా పెట్టుకొని ప్రతిచిన్న విషయంలో పాటించగల్గడం కష్టం. ఈ విషయంలో ఒక ఉదాహరణ శ్రీరాముడి విషయంలో ఎలా ఉదహరించబడిందో మరొక వ్యాసంలో ఉదహరిస్తాము. ఇక్కడ సీతకు సంబంధించిన విషయాన్నే చర్చిద్దాం.

పాతివ్రత్య ధర్మం వుందనుకోండి. "తూ,చ" తప్పకుండా అక్షరాలా పాటించడం చాలా కఠినమైనపని. కాని వివాహాన్ని పరమపురుషార్థ సాధనంగా మార్చుకుని మానసికంగా ఉత్తమస్థాయిని పొందాలనుకున్నప్పుడు అదిచాలా ఉపకరిస్తుంది. అటువంటి స్థాయినంతకుముందే పొందివున్నప్పుడు వారికి ఆ ధర్మం సహజంగానే, స్వాభావికంగానే సాధ్యపడుతుంది. ఈ ధర్మాన్ని ఆచరించగల్గడం పరమార్థంమీద ఒక వ్యక్తికున్న అభిలాష, ఆశయాలబలంమీద ఆధారపడుతుంది. పరమార్థంయందున్న కోరిక అతిబలీయమైనప్పుడు ఆ కోరికే యితర బలహీనతలనన్నింటినీ - దానికి విఘాతం కల్గించేవాటిని దహించేస్తుంది. పరమార్థంయందు అంతటి లక్ష్యం చాలావరకు జన్మత: రావలసిందే. చెబితే వచ్చేదికాదు. ఆ సంగతి రాముడికి తెలుసు. అందుకే లక్ష్మణుడు రాజ్యం రామునికి ధర్మత: రావాలని ఎంత పట్టుదలగా చెప్పినా రాముడు పితృవాక్యపాలన, తల్లికి (కైకకు) సంతోషంకూర్చడమని నిక్కచ్చిగా తేల్చిచెబుతాడు. అందులోని రహస్యం ఏమంటే దశరథుడు కైకకిచ్చిన మాట తప్పకుండా ఆయన ధర్మాన్ని ఆయన కాపాడుకొనేలాగ సహాయపడాలంటే రాముడు అరణ్యవాసాన్నంగీకరించాలి. అక్కడ రాముడు పితృవాక్యపాలన అనే తన ధర్మాన్ని కాపాడడమేకాక తండ్రికూడా తన వాగ్దానాన్ని నిలుపుకునేలాగ సహాయపడడం మనం గ్రహించాలి. పరశురాముడు బాలకాండ చివర విష్ణు ధనుస్సును తీసుకువచ్చినప్పుడు కూడా తండ్రియొక్క గౌరవాన్నెలాకాపాడాడో ఆ సందర్భంలో వివరించబడింది.

దశరథుడు చెప్పినమాట పాటించడం అనేది పరమధర్మంగా రాముడు తనకైతానే ఎన్నుకున్నాడు. అందుకే ఆయన మరణానంతరం కూడా భరతాదులొచ్చి పున: రాజ్యాన్ని స్వీకరించమన్నా రాముడంగీకరించడు. తను అగ్రజుడైనందువల్ల తనకే రాజ్యం రావాలన్నది లౌకికధర్మం. తనకు కష్టంగా, విరుద్ధంగా వున్నా అడవికి వెళ్ళడం అన్నది పరమధర్మం. తానెన్నుకున్న పరమధర్మం కారణంగా సీతను, లక్ష్మణుణ్ణీ అడవులపాలుచేసి, తనతో బాధలుపడేలా చెయ్యటం ఆయనకు ధర్మంకాదు. సీతను పతివ్రతా ధర్మాన్ననుసరించి తనతో అడవికి రమ్మని రాముడే చెబితే అది అతని స్వార్థం అవుతుంది. పైగా తాను రమ్మంటే వచ్చే సీతకు త్రికరణశుద్ధి లోపిస్తుంది. అప్పుడది పరమధర్మం అవదు. కనుక పతిగా ఆమె సుఖాన్ని తాను అభిలషించడం అన్న ధర్మాన్ననుసరించి ఆమెతోడు తనకు కావాలన్న స్వార్థాన్ని విడిచి అలా అయోధ్యలోనే వుండమని శాయశక్తులా చెబుతాడు. కాని శాసించడు. ఆమె త్రికరణశుద్ధిగా పాతివ్రత్యమనే పరమధర్మాన్ననుసరించి అరణ్యవాసాన్నే కోరేటట్లయితే తీసుకువెళ్ళడానికి సిద్ధమేనని రాముడి అంగీకారమే ఋజువుచేస్తుంది. అలాగే కౌసల్య వస్తానంటే భర్తను అయోధ్యలో వుంటూ సేవించటమే ఆమె లౌకికధర్మం గనుక ఆమె ఎంతకోరినా అంగీకరించడు. మళ్ళీ లక్ష్మణుడు వస్తానన్నా కాదనడు. కాబట్టి పరమధర్మాన్ని త్రికరణశుద్ధితో అనుసరించేదీ లేనిదీ నిశ్చయించుకోడానికి పూర్తి స్వేచ్ఛను రాముడు తనకు యివ్వటమే అతడు ప్రథమంగా ఆమెను అయోధ్యలో వుండమని చెప్పటం అని సీతకు తెలుసు.

రాముడి మనస్సులో వున్న భావాన్ని సీత ఎంతగా గమనించగలదో గ్రహించాలంటే భర్త దశరథ, కైకల

సన్నిధికి వెళ్ళినది పట్టాభిషేకానికనుకొన్న సీత తిరిగి అరణ్యవాసానికి సిద్ధమై వచ్చినప్పుడు 'రాముడు అరణ్యానికెందుకెళ్ళాలి? రాజ్యానికతనిదే కదా హక్కు? దశరథుడు కైక చెప్పిన మాట ఎందుకు వినాలి?' లాంటి ప్రశ్నలు ఆమెకు రావు. లక్ష్మణుడు, కౌసల్య అయినా అట్లాంటి మాటలన్నారుగాని పితృవాక్యపాలన రాముడి పరమధర్మం అని ఆమెకు తెలుసు. తర్వాత రాముణ్ణి ధర్మంలో అనుసరించడం ఆమె పెట్టుకున్న పరమధర్మం. ఆమె పరమధర్మాన్ననుసరించను నిశ్చయించుకొన్నప్పుడు రాముడు యింక ఆమె రాకకు ఆటంకపరచడు. అయితే సీత రాముడి మనస్సును తెలుసుకొన్నట్లు రాముడు సీత మనస్సునట్లా పరీక్షచేయకుండా తెలుసుకోలేదా అంటే తెలుసుకున్నా ఆమె నోటివెంట ఆ మాటవినడంలో ఆమె భర్తగా రామునికి ఒక ఆనందం. ఆమె పాతివ్రత్యానికి, ప్రేమకూ తగినట్లే రాముడు చెబుతాడు సమాధానం:

"నదేవి తవదు:ఖే నస్వర్గమప్యభిరోచయే ।
నహిమేస్తి భయంకించిత్ స్వయంభోరివ సర్వత:" ॥

(30:27)

తాత్పర్యం: ఈ పాతివ్రత్యమనే పరమధర్మాన్ని సీత హృదయపూర్వకంగా యిలా ఆచరించటం కైకకు దశరథుడు తనకిచ్చిన వరాన్ని నిలబెట్టుకోవాలన్న పట్టుదల, దానికి దశరథుడు అయిష్టంగానైనా కట్టుబడడం లౌకికధర్మం. భర్త సంతోషాన్నే తన సంతోషంగా భావించడానికి కైకకు నైతికబలంలేదు. అందుకే ముమ్మారు పాదాలమీదబడి రాముని అరణ్యవాసానికి పంపద్దని దశరథుడు బ్రతిమాలినా, రాముడు అరణ్యానికెళ్ళాక తాను బ్రతుకనని, కైక విధవకావలసి వస్తుందనీ దశరథుడు వాచాచెప్పినా కరుగకపోవడమూ-సీత ప్రవర్తనతో చక్కని వైవిధ్యం గోచరింపచేసి, సీతారాములు ధర్మపరాయణతను, ఒకరి ధర్మపరాయణతను మరొకరర్థంచేసుకోగల సూక్ష్మబుద్ధినీ చూచి మనం అబ్బురపడతాము. సీత భూమిలోంచి పుట్టి నాగలిచాలులో దొరికినందుకు రాముడితోపాటు కష్టాలు పంచుకోగల సామర్థ్యంలో, ఓర్పులో అపర భూదేవిగా, విష్ణువు అంశ అయిన రాముడికి నిజమైన సహధర్మచారిణిగా మన హృదయాలకు గోచరిస్తుంది.

రాముడు ఆమెను మొదట అరణ్యానికి రావద్దని, అయోధ్యలో ఎందుకుండమని ఎందుకుచెప్పాడో 30వ సర్గ 28వ శ్లోకంలో చెప్పాడు-

"తవ సర్వమభిప్రాయ మవిజ్ఞాయ శుభాననే ।
వాసం నరోచయే రణ్యే శక్తి మానపిరక్షణే" ॥

తాత్పర్యము: "అరణ్యంలో నిన్ను రక్షించుకొనేటంతటి శక్తిమంతుణ్ణైనప్పటికీ నీ అభిప్రాయం పూర్తిగా నాకు తెలియకపోవటంచేత నీవరణ్యానికి రావటానికంగీకరించలేదు".

ఆమె హృదయం పరమధర్మాన్ని స్వయంసిద్ధంగానే కోరుతోందని తెలసినతర్వాతనే ఆయన ఆమె రాకనంగీకరించారు. చదువరులు కొందరు తలచినట్లు సీత రాముని మాటలను మొదటనే అంగీకరించినట్లైతే పాతివ్రత్య ధర్మంలోని పరమధర్మాన్ని విడిచి సాధారణ ధర్మాన్ని పాటించినదే అయ్యేది. శ్రీరామునికి కూడా భార్య తనకు తగినదని, తనకు సరియైన గుణములు కలదని, తన పరధర్మాచరణలో పంచుకోగలదనీ మొదటిసారిగా ఆమె తన ఆత్మబలాన్ని వ్యక్తంచేసింది. అందుకే రాముడన్నాడు-

"(నీ నైజము తెలుకున్నందున) నేను నిన్నింక విడువజాలను-ఆత్మవంతుడు ఎట్టి కష్టమందైనను కీర్తిని విడువజాలనట్టు".

ఇక్కడ చాలా గంభీరభావం వ్యక్తంచేసాడు రాముడు. ఆత్మవంతునికి, ఆత్మజ్ఞానికీ వద్దన్నా వదలక కీర్తి వెంటవుంటుంది. సూర్యుణ్ణి కాంతి విడువనట్లు.రాముడు, సీతా గూడా పరమధర్మంలో సారూప్యులు గనుక వారికి ఆంతర్యంలో ఎడబాటుండదు. ఆత్మపరునికి వుండే కీర్తితో పోల్చడంలోని రహస్యం ఆత్మవంతుడు కీర్తికోసం పాకులాడకపోవడము, అయినా అతనివెంట కీర్తి కసహజంగానే వుండడం గమనించదగినది. లేకుంటే 'విడువజాలను' అన్నప్పుడు పామరులకు తమ భార్యలయందు వుండు మమకారమే రామునికీ వున్నదనియనే అల్పబుద్ధి తలవకమానదు! 30వ శ్లోకంలో ముందే పతివ్రతలు ఏవిధంగా పతులననుసరించారో వివరిస్తాడు రాముడు. సీత రాముని నిజమైన సహధర్మచారిణి. అంటే ధర్మాచరణలో సమానురాలు, దొడగునది అని. అక్కడే కైకకు, ఆమెకు తేడా. కైకకు, కౌసల్యకు కూడా అంతే భేదం. కౌసల్య రాముడు ధర్మాన్ని గుర్తుచేసిన మీదటనైనా ఆ ధర్మాన్నంగీకరించినది. కైక అట్లు చేయలేదు. రాముడు తను వనానికి తీసుకుపోవుటగురించి -----

"మొదట నాకు నిన్ను దణ్డకారణ్యమునకు తీసుకుబోవచ్చునని తోచలేదు. అయితే నీవు పతివ్రతవు గావున 'నేనుకూడా వనంలోనే వుంటాను' అని నిశ్చయించుకొన్నావు. ఇప్పుడు నీభావం తెలిసింది గనుక నిన్ను నాతో తీసుకువెడతాను" 30వ సర్గ 40, 41, 42 లలో ఆమె పాతివ్రత్యాన్ని అభినందిస్తాడు రాముడు. అంతటి ధర్మాత్మురాలుగనుక సీత తనకంతటి ప్రేమపాత్రురాలైనదన్న సంగతిని వ్యక్తంచేసి చివరికిలా అంటాడు-

"నీవంటి సహధర్మచారిణి లేకున్న నాకు స్వర్గమైనా సరే అక్కరలేదు".

46వ శ్లోకంలో రాముని అంగీకారం విన్న సీత సంతోషంతో చేయవలసిన దానాదులు ఎంత ఉత్సాహంతో చేసిందో చెప్పటంలో వాల్మీకి మహర్షి సీత ఆచరించే పాతివ్రత్యం ఎంత హృదయపూర్వకము, సహజమూ అయినదో చూపుతూ, కౌసల్యకు రాముడు ధర్మాన్ని గుర్తుచేసినా ఆమె కొంచెం యత్నంమీదగాని పతిసేవలో అయోధ్యలో వుండిపోడానికంగీకరించలేకపోవడాన్ని చిత్రించడంలో సహజధర్మాన్ననుసరించే ఉత్తమ మానవులకు, పరమధర్మాన్ని ఆచరించగల మహాత్ములకూ వుండే భేదాన్ని అద్భుతంగా చిత్రించారు.

సీతలోని గొప్పదనం మరొక్కటి. రాముని ఒక్కసారిగూడా "మీరు జ్యేష్ఠపుత్రులు, రాజ్యార్హులుగదా! మనమెందుకు అరణ్యానికి పోవాలి? మీకు పౌరుషములేదా?" మొదలైన మాటలే అనకపోవడంలో సరిగ్గా రాముని పోలివుంది. లక్ష్మణుడు రాముని వనవాసాన్ని గురించి వేసిన ప్రశ్నలలో ఒక్కటికూడా రాముడు, దశరథ కైకేయిలలో ఒక్కర్నిగూడా వేయక పితృవాక్యపాలన, సత్యవ్రతము పాటించాడు. అదే ఆయనకు ప్రీతి. సీతకూడా తన ఏకైక ధర్మమైన పాతివ్రత్యాన్ని ఒక్క వేరుమాటలేక నిర్వహించను సంకల్పించిన సంగతే ఆమెను రామునికంత ప్రేమ పాత్రురాలను చేసినది.

---



# శ్రీ సాయి సచ్చరిత్ర



**మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు** **ఫిబ్రవరి సంచిక తరువాయి**

**స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ** అధ్యాయం - 49

శ్రీ గణేశాయ నమ:, శ్రీ సరస్వత్యై నమ:, శ్రీ గురుభ్యోన్నమ:,

శ్రీ కులదేవతాయై నమ: శ్రీ సీతారామచంద్రాభ్యాం నమ: శ్రీ సద్గురు సాయినాథాయ నమ:



అందుకని బాబా అతనికి ఒక మహిమ చూపించి అతనికి విశ్వాసాన్ని కలుగజేసారు. ఒక్కొక్కసారి మహాత్ములు యుక్తిని ఉపయోగించి తమ కార్యాన్ని సాధిస్తారు (34). హరిభావూ స్నేహితునితో కలిసి కోపర్గావ్ చేరి గోదావరిలో స్నానం చేసి టాంగాలో షిరిడీ బయలుదేరాడు(35). షిరిడీ చేరగానే కాళ్ళూ చేతులూ కడుక్కుని కొత్త చెప్పులు వేసుకున్నాడు. తలకు జరీ తలపాగా కట్టుకున్నాడు. సాయిబాబాను చూడాలనే కోరిక అతనికి తీవ్రంగా వున్నది(37). మశీదుకు చేరాక సాయిబాబాను దూరంనుండీ దర్శించుకున్నాడు. కాని దగ్గరకు వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేసుకోవాలనిపించింది (38). కానీ అందుకు అతని పాదరక్షలు (చెప్పులు) అతనికి ఆటంకంగా వున్నాయి. అవి పెట్టడానికి భద్రమైన చోటు అతనికి కనిపించలేదు. అయినా అక్కడే ఒక మూల చూసి భద్రంగా వాటిని పెట్టాడు. తర్వాత సాయి చెంతకు వెళ్ళాడు(39). సాయిబాబా చరణాలకు నమస్కరించి ఊదీ, ప్రసాదమూ తీసుకున్నాడు. తిరిగి బసకు వెళ్ళడానికి బయలుదేరాడు (40). బయటకు వచ్చి చెప్పులు వేసుకుందామని చూసేసరికి తన చెప్పులు కనిపించలేదు. ఎంతో వెదికాడు. కాని కనిపించలేదు. ఇక అతడు ఆశలు వదులుకొని ఖిన్నవదనుడై చెప్పులు లేకుండానే బసకు బయలుదేరాడు (41). మశీదుకు ఎంతోమంది భక్తులు వస్తూపోతూవున్నారు. తన చెప్పులగురించి ఎవరిని అడగాలో అర్థంగాలేదు (42). అతని మనస్సు వికలమైపోయింది. తన పాదరక్షలు కళ్ళముందుగా మెదులుతున్నాయి. మనస్సులో పాదరక్షలకోసం దిగులు. అతని ధ్యాస అంతా పాదరక్షలమీదే ఉన్నది (43). అతడు ఎంతో యిష్టపడి ఆ చెప్పులు కొనుకున్నాడు. అవి యిప్పుడు అపహరించబడ్డాయి. చివరకు అతడు అది తప్పకుండా దొంగలపనే అయివుంటుందనుకునేవాడు(44).

తర్వాత స్నానాదులు పూర్తిచేసుకుని, పూజ చేసుకుని, పంక్తిలో కూర్చుని భోజనం చేసాడు. కానీ అతని మనస్సు స్థిమితంగా లేదు (45). 'ఆ సభామండపం సాయి యొక్క స్థానం' మరి అక్కడ ఆయన దృష్టినుండి తప్పించుకుని ఆ చెప్పులను తీసుకువెళ్ళడమనేది సామాన్యమైన విషయమా? ఎంత ఆశ్చర్యం!'. ఈ విధంగా అతడు పరిపరివిధాలుగా ఆలోచిస్తున్నాడు. అతనికి అన్న పానీయాలుకూడా సహించలేదు. భోజనమైన తర్వాత అందరితోపాటు అతనుగూడా చేతులూ, ముఖమూ కడుక్కోడానికి బయటకు వచ్చాడు(46, 47). ఇంతలో ఒక మరాఠీ పిల్లవాడు అక్కడికి వచ్చాడు. అతడు ఒక కర్రకు చెప్పులజత తగిలించుకుని దానిని జెండాలాగా పట్టుకుని వున్నాడు. "బాబా

నాకు ఈ కర్ర యిచ్చి దీనిని పట్టుకు వెళ్ళమని పంపించారు (49). 'హరి కా బేటా! జరీ కా ఫేటా!' అని కేకలు పెడుతూ వెళ్ళమన్నారు. ఎవరైతే 'ఇవి నా చెప్పులే' అని ఆతురతతో అడుగుతారో వారికి ఈ చెప్పులు యివ్వాలి' అని నన్ను ఆదేశించారు" అని చెప్పాడు (50).

"మొదట అతడు హరియొక్క కుమారుడు అవునో కాదో నిశ్చయంగా తెలుసుకో. అప్పుడే అతనికీ చెప్పులివ్వు. ఎక్కువ హడావుడి చేయబోకు" అని బాబా నన్ను ఆజ్ఞాపించారు" అని ఆ పిల్లవాడు చెప్పాడు(51). ఆ పిల్లవాని అరుపులు చెవిన పడగానే హరిభావూ పరుగెత్తుకుని వెళ్ళాడు. ఆ చెప్పులను గుర్తుపట్టాడు. చాలా ఆశ్చర్యపోయాడు(52). అతని కళ్ళముందు ఆనందాశ్రువులు స్రవించాయి. శరీరం పులకరించింది. కంఠం గద్గదమైంది. తన చెప్పులు కనిపించేసరికి అతనికెంతో ఆనంద కలిగింది. పోయిన తన పాదరక్షలు దొరకడం అద్భుతమనిపించింది (53). అప్పుడతడా పిల్లవానిని దగ్గరకు రమ్మని పిలిచి యిలా అన్నాడు; "ఏవీ? ఆ చెప్పులను చూపించు!" వాటిని చూచి ఆశ్చర్యంతో, "అవునూ! ఈ చెప్పులు నీకెక్కడ దొరికాయి? ఆ వివరం చెప్పు" అన్నాడు (54). అందుకా పిల్లవాడు, 'అదంతా నాకేమీ తెలియదు. బాబా చెప్పినట్లు చేయడమే నా పని. 'హరి కా బేటా' ఎవరో వారు నాకు జరీ తలపాగా చూపించాలి(55). అలా చూపించినవారికే నేనీ చెప్పులను యిస్తాను. ఇంక యితర గుర్తులేవీ నాకు పనికిరావు. బాబా చెప్పిన గుర్తులు చూపించినవారే ఈ చెప్పులు తీసుకుంటారు" అన్నాడు (56). ఆ చెప్పులు తనవేనని హరి కనోబా చెప్పాడు. కానీ ఆ పిల్లవాడు యివ్వలేదు (57). అప్పుడతడిలా అన్నాడు, " ఒరే బాబూ! నేనే హరిని, కనోబా కుమారుణ్ణి. ఇదిగో! ఈ జరీ తలపాగా చూడు! నీ సందేహం తీరుతుంది. ఇప్పుడు చెప్పు, ఆ చెప్పులు నావే కదా!" (59). అప్పుడా పిల్లవానికి అతడే హరి అని అర్థమైంది. అతనికా పాదరక్షలు యిచ్చేశాడు. ఆ విధంగా హరిభావూ కోరిక తీరింది. ఈ అనుభవం ద్వారా బాబా మహాత్ముడన్న విశ్వాసం అతనికి కలిగింది (60).

హరిభావూ తన మనస్సులో యిలా అనుకున్నాడు; జరీ తలపాగా నా తలమీదే వుందిగాబట్టి బాబా ఆ తలపాగా గురించి చెప్పడంలో విశేషమేమీలేదు (61). కానీ నేను వేరే ఊరివాణ్ణి, పైగా షిరిడీ రావడం యిదే మొదటిసారి. నా పేరు హరి అని బాబాకు ఎలా తెలిసింది?(62). అంతేగాక నా తండ్రిని ఎవరూ చూడనైనా లేదు, ఆయన పేర 'కనోబా' అని బాబాకు తెలియడం ఆశ్చర్యంగా వుంది (63). నా స్నేహితుడు సాయిబాబా గురించి చెబితే అతని మాటలకు అవహేళన చేసాను. అందుకు యిప్పుడు నేను పాశ్చాత్తాపపడుతున్నాను (64). ఇప్పుడు నాకు అనుభవం కలిగింది గనుక సాయిబాబా యొక్క మహాత్యం తెలిసింది. ఇప్పుడు నా సంశయాలన్నీ తొలగిపోయాయి. శ్రీ సాయిబాబా నిజంగా గొప్ప మహాత్ములు" (65).

బాబా ఎవరి భావం ఎలా వుంటుందో వారికి అలాంటి అనుభవాన్నే ప్రసాదిస్తారు. హరి కనోబాకు సాయిబాబాను పరీక్షించాలనే కోరిక తప్ప పరమార్థం పట్ల ఆసక్తిలేదు (66). సాయి సమర్థులు గొప్ప మహాత్ములని స్నేహితులు చెప్పారు. ఆ విషయం స్వయంగా తెలుసుకోవాలని అతడు షిరిడీ వచ్చాడు (67). మహాత్ముల చరణాల చెంత జీవితాన్ని సమర్పణం చేసుకున్నట్లయితే సద్గురుని అనుగ్రహం కలుగుతుంది. అట్టి ఆలోచన అసలే లేనట్లయితే సద్గురుని వద్దకు వచ్చి మాత్రం ప్రయోజనమేమున్నది?(68). మహాత్ముని వద్దకు వెళ్ళి చమత్కారం చూడాలనుకున్న వారికి పోయిన చెప్పులజత చేతికి వచ్చింది కదా!(69) చెప్పులు పోయినంత మాత్రాన వచ్చే నష్టమేమున్నది? వాటి కోసం అతని మనస్సు ఎంతో తల్లడిల్లిపోయింది! అవి లభించేవరకూ మనశ్శాంతి లేకుండా పోయింది గదా!(70).

మహాత్ముల సాన్నిధ్యం లభించడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి భక్తిమార్గం. రెండవది జ్ఞానమార్గం. జ్ఞాన మార్గం కఠినతరమైనది. భక్తిమార్గం సులభం (71). భక్తి మార్గం అంత సులభమైనప్పుడు ఆ మార్గాన్ని అందరూ ఎందుకు అవలంబించలేక పోతున్నారు? దానికి కారణమేమిటంటే – అందుకు కూడా మహాభాగ్యముండాలి(72). కోటి జన్మల పుణ్యముంటేనే మహాత్ముల దర్శన భాగ్యము, సన్నిధి భాగ్యమూ లభిస్తాయి. అప్పుడు భక్తి వికసిస్తుంది (73) సామాన్యంగా మనమందరమూ ప్రవృత్తి తత్పరులమై వుంటాము. అంటే ఎప్పుడూ ప్రాపంచిక విషయాలపట్ల ఆసక్తి కలిగివుంటాము. మనకు నివృత్తి మార్గం అసలు పట్టదు. అంటే పరమార్థం గూర్చిన చింతనే వుండదు. ఇటువంటి మనోవృత్తి వున్నప్పుడు భక్తి ఎలా కలుగుతుంది? (74) మన ప్రవృత్తిని బట్టే ప్రాప్తివుంటుంది. ఇది ముమ్మాటికీ నిజం. ఇందులో ఎటువంటి సందేహాలకూ తావులేదు (75). మనము విషయవాంఛలను నెరవేర్చుకోడానికే సాయిబాబా వద్దకు చేరుతాము. కనుక మనకు ఆయనవద్ద లభించేదిగూడ అదే! అలాగాక పరమార్థం కోసం వచ్చేవారికి పరమార్థమే లభిస్తుంది(76).

ఇప్పుడు బాబా యొక్క మరొకలీల గురించి చెప్పుకుందాము. సోమదేవస్వామి అను అతడు బాబాను పరీక్షించడానికి షిరిడీ వచ్చాడు (77). ఇతడు సం॥ 1906లో కాశీలోని ఒక ధర్మశాలలో భాయిజీ అనే గృహస్తుని కలిసాడు. ఈ భాయిజీ కాకా సాహెబ్ దీక్షిత్‌కు సోదరుడు. భాయిజీ బదరీ, కేదార్ క్షేత్రాలు యాత్రలు చేస్తుండగా ఈ స్వామి కలిసాడు (78). బదరీ, కేదార క్షేత్రాలు దర్శించి క్రిందికి దిగుతుండగా మార్గంలో ఒక విశ్రాంతి స్థావరంలో కొందరు యాత్రికులు కలిసారు. వారిలో ఈ సోమదేవస్వామి ఒకరు. అతడు బాబాయొక్క మహిమ విని ప్రభావితుడైనాడు (81). ఆ స్వామిదే ఈ కథ. బోధప్రదమైన ఈ లీల బాబాయొక్క తత్వాన్ని స్పష్టం చేస్తుంది. శ్రోతలకు ఆనందాన్ని కలిగిస్తుంది (82). భాయిజీ కాలకృత్యాలు తీర్చుకోడానికి బహిర్భూమికి వెళ్ళినప్పుడు ఈ స్వామి పరిచయమయ్యాడు. ఇరువురూ మాట్లాడుకున్నారు. వారిరువురి మధ్య స్నేహమేర్పడింది. గంగోత్రికి దిగువున ఉత్తరకాశిలో డెహ్రాడూన్‌కు డైబ్భైక్రోసుల దూరంలో సోమదేవస్వామి వుంటాడు. ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడంలో యిద్దరి మధ్య ఆత్మీయత ఏర్పడింది(83–89). భాయిజీ స్వామితో యిలా అన్నాడు. "మేము నాగపూర్‌లో వుంటాము. మీరు అటుప్రక్కకు ఎప్పుడైనా రావడం జరిగితే మీ దర్శన భాగ్యం మాకు కలిగించాలి. మా గృహాన్ని మీరు పావనం చేయాలి. మేము చేసే చిన్ని సేవలను మీరు స్వీకరించాలి. భగవంతుడు ఈ నా చిన్ని కోరికను నెరవేర్చుగాక!" (88–89). సం॥1906లో వీరిరువురూ ఈ విధంగా మాట్లాడుకున్నారు. తర్వాత ఎవరి స్థానాలకు వాళ్ళు వెళ్ళిపోయారు (91, 92). అయిదు సంవత్సరాలు గడిచిపోయాయి. సోమదేవస్వామికి సాయి యొక్క సమాగమభాగ్యసమయమొచ్చింది. అతనికి భాయిజీని కలుసుకోవాలన్న కోరిక తీవ్రంగా కలిగింది (93). సం॥1911లో సోమదేవస్వామి నాగపూర్ వచ్చాడు. అక్కడ భాయిజీ ద్వారా సాయినాధుని గూర్చి తెలుసుకున్నాడు. అతనికి చాలా ఆనందం కలిగింది. శ్రీ సాయినాధుని దర్శించాలన్న సంకల్పం కలిగింది(94). స్వామిజీని సిఫారసు చేస్తూ భాయిజీ ఒక కరపత్రాన్ని స్వామీజీకి యిచ్చాడు. అతడు స్వామీజీ షిరిడీ వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లూ చేసిన తర్వాత స్వామి శిరిడి బయలుదేరాడు (95). అతడు మన్మాడ్‌లో దిగగానే కోపర్గావ్ వెళ్ళే రైలు బయలుదేరడానికి సిద్ధంగా వుంది. స్వామి ఎంతో ఆనందంతో కోపర్గావ్‌నుండి టాంగాలో షిరిడీ బయలుదేరాడు (96).

– సశేషం



# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)



ఫిబ్రవరి సంచిక తరువాయి

- శ్రీమతి శ్రీదేవి



"దీపకా! నీవు అడిగినట్లే తండ్రి అడుగగా కుమారుడిలా చెప్పాడు" అంటూ వేదధర్ముడు దత్తచరిత్రను యీ విధంగా కొనసాగించాడు.

అప్పుడు అలర్కుడు సుబాహువు మహర్షికి నమస్కరించి, "మహాత్మ! మన తల్లి మదాలస వైరాగ్య పూరితమైన బోధలతో నా అన్నలైన మీరు ముగ్గురూ జ్ఞాన సంపన్నులైనారు. నేను మాత్రము రాజ భోగాలలో చిక్కి సుఖలంపటుడనై మూఢుడనై జీవించాలనుకున్నాను. అటువంటి పరిస్థితిలో నన్ను ఒక దారికి తెచ్చి, నన్ను ఉద్ధరించిన మీ దయా హృదయాన్ని ఏమని కొనియాడను? ఓ స్వామీ! మీ దయతో నా జన్మధన్యమైంది. మీకు నా వేనవేల నమస్కారాలు." అన్నాడు. అందుకు సుబాహువు తమ్ముని వెన్నుతట్టి, "తమ్ముడా! నువ్వు వివేకివి కనుక యింత త్వరగా పరమార్థాన్ని అందుకొనగలిగావు. ఆ దయామయుడు శ్రీ దత్తస్వామిని ఆశ్రయించిన వారు ఎవరు ధన్యులు కాకుండా వుంటారు? నాయనా! అలర్కా! యిక నీవు రాజ్యపాలన చేయదలచుకొంటావో, వనములకు వెళ్ళి తపస్సులో నిమగ్నమౌతావో నీ యిష్టం. ఏమి చేసినా నీవింక బంధములలో చిక్కుకొనవన్న నమ్మకము, ధైర్యము నాకు కలిగాయి. కనుక నీ యిచ్ఛ వచ్చినట్లుగా చేయి. నీ సాధన ఫలించుగాక! నీకు శుభమగుగాక! ఇక నేను వెళ్లొస్తాను" అంటూ తమ్ముని దీవించి, సుబాహువు మహర్షి అడవులకు వెళ్లిపోయాడు.

ఆ తర్వాత అలర్కుడు తన రాజ్యమునకు వెళ్ళి, సమర్థుడైన తన పెద్దకుమారునికి పట్టాభిషేకము చేసి, రాజ్యభారమునతనికప్పగించి, తాను సకల బంధములను విడనాడి, విరాగియై అరణ్యములకు వెళ్లి పోయాడు. ఆ తర్వాత శ్రీ దత్తాత్రేయస్వామి తనకుపదేశించిన యోగమును చాలాకాలం అభ్యసించి, సుఖదుఃఖాది ద్వంద భావనలకు అతీతడై చివరకు యోగస్థితిని పొందాడు అలర్క మహారాజు. యోగసిద్ధిని పొంది, అఖండానందంలో తేలియాడుతున్న అలర్కుడు ఒకనాడు తన దివ్యదృష్టితో విశ్వమును వేడుకగా చూశాడు.

దేవలోకంలో సురలు, పాతాళలోకంలో అసురులు, భూలోకంలో మానవులు సంచరిస్తున్నారు. పశు, పక్షి, వృక్ష జాతులు, నదులు, కొండలు, సూర్య, చంద్ర, నక్షత్రాది గ్రహగోళాలు, ఇలా వివిధ రకములైన సృష్టి విచిత్రాలను తిలకించాడు అలర్కుడు - అయితే జగమంతా అహంకార, మమకారములతో, సుఖదుఃఖములతో, కామక్రోధాది

మనో వికారాలతో గూడి అశాంతితో సంచరిస్తుండటం చూచాడు. అతడి మనసెంతో కలవరపడింది. మోక్ష ద్వారమై తలుపు తెరిస్తే పరమార్థాన్ని అందించే మానవజన్మను పొంది కూడా భగవంతుని స్మరణకు దూరమై అనేక పాపతాపాలకు లోనై అలమటిస్తున్న జనులను చూచిన అలర్కునికి తాను కూడా ఒకప్పుడు యీ పాప సంకిలంలో కూరుకు పోయి వ్యర్ధ జీవితాన్ని గడిపాను కదా!అనిపించింది. 'ఈనాడు దత్తదేవుని కృపతో తానందుకొన్న ఆత్మానుభూతి కలిగించిన ఆనందం ముందు ఆ రాజభోగాలు, మానుషానందాలు వందవ వంతైనా సరిసమానం కావుకదా!' అనుకొని అలర్కుని నోటి నుండీ అతని భావాలన్నీ ఒక పాటగా వెలువడ్డాయి.

పడియుంటి నొకనాడు యీ పాపపంకమున
కడదాక ఎరుగలేనైతి అది పంకమని!
ఎన్ని కథలెన్ని సొద లెన్నెన్ని బాధలు ।
ఎన్నైన కలవు మానవ జీవితపు వ్యధలు ॥
తెలియ ఆత్మానంద సుఖములో తేలగా
వెలలేని దివ్యానుభూతి చవి చూడగా
ఇహలోక సుఖము బ్రహ్మానంద సుఖములో
నూరవ వంతైన సాటికాలేదుగా ।
ఎరుగ మోక్షానంద మాధుర్ల సీమతో
సరికావు ఐహిక భోగములు, సౌఖ్యములు
ఎరుగలేరీ దివ్య జీవనపు మధురిమలు
ఎండమావుల నీరు వెదికేటి మానవులు
పడియుంటి నొకనాడు యీ పాప పంకమున
కడదాక ఎరుగలేనైతి అది పంకమని
బహుజన్మ పుణ్యములు ఫలము మదాలస
మాతకు సుతునిగా జన్మించు భాగ్యంబు
తల్లి యిచ్చిన దివ్య అంగులీయకమే
అందించె నాకు దత్తస్వామి సన్నిధి ।
దీన జన రక్షకా శ్రీ దత్త స్వామీ ।
శతకోటి వందనములందుకోవయ్యా ।

– అంటూ అలర్కుడు పాడుకొన్నాడు, మనసారా ।

ఈ విధంగా శ్రీ దత్తాత్రేయుని దివ్యానుగ్రహాన్ని పొంది అలర్కుడు దుర్భరమైన సంసార సాగరాన్ని దాటినవాడై ముక్తిధామాన్ని అందుకొన్నాడు.

"తండ్రీ! అలర్కునికి శ్రీదత్తస్వామి బోధించిన యోగ సాధనా విధానాలను నీకు తెలియజేశాను. ఇక నాకీ

యజ్ఞయాగాదులపై ఆసక్తి లేదు. నిష్క్రియుడనై పరమార్ధసాధనకై కృషి చేసి ముక్తిని సాధించదలచాను, కనుక నేను సకల బంధములను వీడి యిల్లు విడచి తపస్సుకై వనములకేగ నిశ్చయించాను.” అని చెప్పి సుమతి తండ్రి అనుమతి పొంది వెళ్లిపోయాడు. తండ్రి కూడ వానప్రస్థం స్వీకరించి, మోక్షసాధనలో నిమగ్నుడై ఆ తర్వాత కొన్నాళ్లకు సన్యాసాశ్రమం స్వీకరించి, ముక్తిపొందాడు.

వేదధర్ముడు దీపకునితో “దీపికా! నీకు పితాపుత్ర సంవాదము, శ్రీదత్తదేవుని అనుగ్రహము పొందిన అలర్కుని జీవితచరిత్ర, కార్తవీర్యునికి వరమునిచ్చి, బ్రోచి రక్షించిన ఆ స్వామి అద్భుతమహిమ, యింకా ఎన్నెన్నో దత్తస్వామి దివ్య లీలలు తెలియజేశాను. నాయనా! మహిమాన్వితుడైన శ్రీదత్తాత్రేయ స్వామి దివ్య చరిత్ర విన్నవారికి సమస్త కష్టములు, పాపములు నశించి, సమస్త సుఖములు, సకల ఐశ్వర్యములు లభిస్తాయి. సకల శుభములు చేకూరుతాయి. అంతేకాదు, ఎన్నో జన్మల పుణ్య ఫలంగా మాత్రమే స్వామి చరితము వినే భాగ్యం చేకూరుతుంది.” అని చెప్పాడు. – అని బ్రహ్మకు పురుషునికి చెప్పాడని సూతుడు నైమిషేయమునులకు చెప్పాడు.

సూతుడు యింకా కథను యిలా కొనసాగించాడు – దీపకుడు తన గురుదేవుడైన వేదధర్మునికి చేతులు జోడించి నమస్కరించి తన సందేహము నీ విధంగా వ్యక్తం చేశాడు. “గురుదేవా! మీరు సెలవిచ్చినట్లు ఎన్నెన్నో జన్మల పుణ్యఫలముగా నాకు శ్రీ దత్తదేవుని మహిమాన్వితమైన చరిత్రను వినే భాగ్యం కలిగినందుకు ఆనందిస్తున్నాను. గురుదేవా! నాదొక సందేహము. దానిని తీర్చ మీరే సమర్థులు అని నా విశ్వాసం.” వేదధర్ముడు “కుమారా! మనసులో పొడచూపిన సందేహాన్ని అది ఎలాంటిదైనా నివృత్తి చేసుకొనుటము అవసరం. కనుక నీవు నిస్సంకోచంగా నీ సందేహాన్ని తెలియజేయి నాయనా!” అన్నాడు. “గురుదేవా! సృష్టికర్త అయిన పరమేశ్వరుడు అత్రి, అనసూయలకు కుమారుడుగా జన్మించాడు. మునికుమారుడై, యోగియై సంచరిస్తూ వుండే ఆ స్వామి చర్యలు మాత్రం ఎంతో విచిత్రంగా తోస్తాయి. కల్లుత్రాగటం, మాంసభక్షణ చేయటం, స్త్రీసంసక్తుడై వుండటం, యిట్టి చర్యలు బ్రాహ్మణ కుమారుడికి తగునా? ప్రజలకూ జ్ఞాన, యోగ సాధన విధానాలను బోధిస్తూ, ధర్మోపదేశాలు చేస్తూ, ముక్తి అనే లక్ష్యం వైపు వారిని నడిపించే గురువై వుండికూడా, యింతటి అనాచారముతో ప్రవర్తించటం వలన ప్రజలలో ఆయనపై విశ్వాసం సడలిపోతుంది కదా! తాను పవిత్రంగా వుంటూ యితరులకు ఆదర్శప్రాయమైన నడవడిక కలిగివుండవలసిన ఆ స్వామి యిట్టి కూడని చర్యలు చేయటానికి గల కారణమేమిటి ? శ్రేష్ఠులయిన వారు ఎలా ప్రవర్తిస్తే అందరూ అలా ప్రవర్తిస్తారుగదా?

**– సశేషం**


చదవండి! చదివించండి!!

శ్రీ సంహితాయన గురుద్విసాహస్రి

సంస్కృత మూలము : శ్రీ వాసుదేవానంద సరస్వతీ

తెలుగు : ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

వెల : రూ॥ 80–00 లు

ప్రతులు:– శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్,

M.M.Donka, Ongole-2. Ph : 08592-233271

# వార్తాలాపము

ఫిబ్రవరి సంచిక తరువాయి (సీరియల్)

భూత ప్రతిబంధము:- స్త్రీ ధనాదులు వియోగాలు భూత ప్రతి బంధము. సన్యాసికి భూతకాలమందలి భార్యయందు ప్రేమ అనెడు ప్రతిబంధముచే గురువు ఉపదేశించినను తత్త్వజ్ఞానము కలుగలేదు. ఈ విషయమున క్రింద కథ ప్రపంచమున ప్రసిద్దిచెందియున౦ది.

ఒక రాజు ఒక మాహాత్మునివద్ద దీక్షను పొంది సన్యసించెను. ఆతనికి వివేకము, వైరాగ్యము అపరిమితముగ నుండెను. గురువుగారు అవి తెలిసికొనియే ఆతనికి సన్యాసిదీక్ష నిచ్చెను. అనంతరము గురువు తత్వోపదేశము చేయ మొదలిడెను. ఎన్నియో రోజుల తత్వోపదేశము చేసినను శిష్యునకు జ్ఞానము కలుగలేదు. శ్రవణ, మనన,నిధి ధ్యాసనములయందు ఆయనకు తన రాణియందలిప్రేమ ప్రతిబంధకమాయెను. ఆ కారణముచే ఆతనికి తత్త్వజ్ఞానము కలుగలేదు. గురువు సమర్థుడగు యోగి. ఆతనికి తత్త్వజ్ఞానము కలుగకుటుండుటకు గల కారణము తెలిసికొని అంతవరకును తాను ఉపదేశించుచున్న క్రమమునందు మార్పు తెచ్చెను. రాణితో ఆ శిష్యుడు జరిపిన భౌతిక, వ్యావహారిక సంబంధమునాధారముగా తీసికొని ఉపదేశించెను. అంతట పూర్ణజ్ఞానము కలిగెను. గురువు రాణిపై శిష్యునకును గల ప్రేమను దృష్టాంతముగా తీసికొని శిష్యునకు తత్త్వోపదేశము చేసినంతనే ప్రతిబంధము నశించి తత్త్వజ్ఞానము పూర్తిగా కలిగెను.

భావప్రతిబంధము- శ్రుతియందు వామదేవుని దృష్టాంతమున ఈ భావప్రతిబంధము ప్రస్తావించబడినది. వామదేవుని ఆగామి ప్రతిబంధము గర్భధారణమాత్రమున పోయినది.

గర్భ ఏవ ప్రతిపేదే వామదేవోహం మనుభవం సూర్యశ్చ।

వామదేవునకు గర్భమునందుండగనే జ్ఞానము కలిగెను. "నేను మనువును, నేను సూర్యుడను" అను సర్వాత్మభావనము ఆతనికి కలిగెను. గర్భధారణమాత్రముననే ఆ భావప్రతిబంధము పోయి ఆతనికి తత్త్వజ్ఞానము కలిగెను. భరతుని ప్రతిబంధము మూడు జన్మలయందు క్షయమును పొందెననునది భాగవతాదులయందు ప్రసిద్ధమే.

ఆగామీ ప్రతిబన్ధశ్చ వామదేవే సమీరత: ।
ఏకేన జన్మనా క్షీణో భరతస్య త్రిజన్మభి: ॥

"ఆగామి ప్రతిబంధము వామదేవునకు ఒక జన్మములోను, భరతునకు మూడుజన్మలలోను క్షయమునొందెను."

ఈ ఆగామి ప్రతిబంధము అనగా భావప్రతిబంధము. జన్మాంతరమునకు హేతుభూతమగు ప్రారబ్ధావశేషము. అది అనుభవించనిదే క్షీణించదు. దృఢమగు శ్రవణాదులద్వారా అది ఒకటిరెండు జన్మములయందు క్షీణించును. లేనిచో అనేక జన్మలను ఎత్తవలసివచ్చును. ఉదాహరణమునకు వామదేవుని ప్రారబ్ధము ఒక జన్మమునందు క్షీణించెను. ఒక్క జన్మ ఆయనను పొంది తీరవలసివచ్చెననునది నిస్సంశయము. భరతుడు మూడు జన్మముల అనంతరము ప్రారబ్ధము క్షయమును పొందెను.

భరతుడు మూడుజన్మలను పొందుటకు గల కారణము సాంఖ్యసూత్రములయందు ఉన్నది.

"అసాధనానుచిన్తనం బన్ధాయ భరతవత్"

వివేకజ్ఞానమునకు ఆంతరంగిక సాధనము లేనిదే ధర్మమునయినను సాధకుడు చింతనచేయరాదు. ఈ విషమున భాగవతమునందు క్రిందివిధముగా ఒక ఆఖ్యాయిక కలదు.

భరతమహారాజు రాజ్యభారమును విడనాడి అరణ్యమున తపము చేయుచుండెను. ఆయన ఒకరోజున గండకినదిలో స్నానము చేయుటకు వెళ్ళెను. అప్పుడే పుట్టిన లేడిపిల్ల ఒకటి జలప్రవాహమున కొట్టుకొనిపోవుట ఆయన చూచెను. ఆయన దానిని నీటినుండి బయటకు తీసి పాలు పోసిపెంచెను. ఆ లేడిపిల్లపై ఆయనకు కల మక్కువ అపరిమితము. ధ్యానము చేయుటకు కూర్చొనినచో లేడిపిల్ల ఏమయినదో అని చింతించెడివాడు. ఏదైనా క్రూరజంతువు ఎత్తుకొనిపోయెనేమో అని భయపడెడివాడు. ఈ విధముగా ధ్యానభంగము కలుగసాగెను. ఆ చిన్నపిల్ల అంతకంతకు పెరిగి చివరకు లేళ్లగుంపులో కలసిపోయను. అవసానసమయమున భరతునకు లేడివిచారము తప్పలేదు, ఆ దు:ఖముతోనే ఆతడు మరణించెను.

ఉత్తరజన్మమునందు భరతుడు లేడిగర్భమున జన్మించెను. హరిక్షేత్రమున పులస్త్య, పులహామునుల ఆశ్రమములయందు కథా కాలక్షేపములు జరుగునప్పుడు ఈ హరిణము అచ్చటకు వెళ్ళి శాంతచిత్తముతో కథాశ్రవణము చేయుచుండెను. దానికి ఇతర జీవులతో సంసర్గము లేదు. శుష్కత్రణమును, లతాదులను భక్షించి కాలము గడుపుచుండెను. అట్లు కథవినుచుండ "నా ప్రారబ్ధము ఎట్లు పూర్తి అగును." అను చింతయే హరిణమును వేధించుచుండెను ఆ ప్రకారము ఆ హరిణము దేహమును విసర్జించెను.

అనంతరజన్మమున ఆంగిరస వంశీయుడగు ఒక బ్రాహ్మణుని ఇంట జన్మించెను. ఈ బ్రాహ్మణకుమారుని రూపమున ఉన్న భరతుని శరీరము బాగుగా బలసియుండెను. ఆ బ్రాహ్మణకుమారుడు ఎవరితోనూ మాట్లాడదు. మూఢునివలె కూర్చొని యుండెడివాడు. ఈ మూర్ఖుడు ఏ పనికిని ఉపయోగించనందున బలసిన శరీరము ఉండుటచే పొలము పనియందు నియోగించబడెను. ఇట్లుండ ఒకరోజున రహుగణుడను రాజు పాలకీలో కూర్చొని గురువును వెతకుటకు వెళ్లుచుండెను. పాలకీని మోయువారలు అలసియుండుటచే బలిష్ఠుడగు ఈ భరతుని లాగికొనివెళ్లి మోయమనిరి. భరతుడు పాలకి మోయుచు కాలిక్రింద ఏజీవియును పడి చనిపోకుండుటకై గెంతుచు నడువ సాగెను. ఇతర బోయాలు ఆతనితో కలిసి నడువకుండుటచే రాజునకు కుదుపు తగిలెను. ఆతడు అడిగెను. "పాలకీ ఊగుటకు కారణమేమి?" ఇతరబోయాలు పలికిరి. "ప్రభూ, ఈ క్రొత్తవాడు ఇప్పుడే మోతకు వచ్చినాడు. అందుచే త్వరగా నడచుటలేదు." రాజు క్రొత్తవానిని అడిగెను. "ఏమి నీవు చిక్కియున్నావా?" జడభరతుడు వెంటనే సమాధానము చెప్పెను. "కృశించుటయును, పుష్టినిపొందుటయును శరీర ధర్మము. నా స్వరూపముయొక్క ధర్మము కాదు" ఈ మాటలు విని రాజు వెంటనే క్రిందికి దిగెను. ఈతడు ఎవడో తత్త్వవేత్త అని తెలిసికొని జడభరతునకు నమస్కరించెను.

వర్తమానప్రతిబంధము నాల్గురకములు. 1. విషయాసక్తి 2. ప్రజ్ఞామాంద్యము. 3. కుతర్కము 4. విపర్యదురాగ్రహము.

1. విషయాసక్తి అనగా భోగములందలి కోరిక. ఇది ఈ కాలమున చాలామంది జనులయందు కానవచ్చుచున్నది. మానవుడు ఈ విషయాసక్తిచే యథార్థమగు ఆత్మానుభవము దూరమయి బంధమునందు చిక్కువడును.

కురఙ్గమాతఙ్గపతఙ్గభృఙ్గమీనా: హతా: పఞ్చభిరేవ పఞ్చ।
ఏక: ప్రమాదీ స కథం న హన్యతే య: సవతే పఞ్చభిరేవ పఞ్చ॥

"లేడి, ఏనుగు, మిడత, తుమ్మెద, చేప- ఈ ఐదును వరుసగా శ్రోత్ర, త్వక్, చక్షు:, ఘ్రాణ, రసనేంద్రియముల విషయములందు ఆసక్తిచే నాశనమును చెందుచున్నవి. అనగా ఏకేంద్రియాపరాధము చేతనే అవి నాశనమును చెందుచున్నవి. ఇక మనుష్యుడు పంచెంద్రియో పరాధములకు గురియై పంచేంద్రియార్థములను సేవించినచో ఏల నశించడు? తప్పక నశించును."

– సశేషం

# శ్రీ సిద్ధారూఢ స్వామి

శ్రీ గురు సిద్ధారూఢ స్వామి జయంతి ప్రత్యేక వ్యాసం - ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

"మధులుబ్ధోయథా భృంగః పుష్పాత్ పుష్పాంతరం వ్రజేత్ ।
జ్ఞాన లుబ్ధస్తథా శిష్యో గురోర్గుర్వంతరం వ్రజేత్"

తేనటీగ వేరువేరు పువ్వుల నుండి తేనె గ్రహించినట్లు, జ్ఞానప్రియుడైన శిష్యుడుకూడ అనేకమంది గురువుల నుండి జ్ఞానమార్జించాలని గురుగీత చెబుతుంది. ప్రతి జ్ఞానీ తన శిష్యులను యితర గురువులనుండి జ్ఞానమార్జించమని ఆదేశించారు. శ్రీకృష్ణుడు అర్జునుణ్ణి భగవద్గీత (4:34)లో అలానే ఆదేశించాడు. రఘువంశానికి గురువైన వశిష్ఠుడు రాముణ్ణి విశ్వామిత్రునితో పంపమని దశరథుణ్ణి ఆదేశించాడు. వ్యాసుడు శుకుణ్ణి జనకమహారాజు వద్దకు పంపాడు. రాముడు అరణ్యంలోని ఋషులందరినీ సేవించాడు. భాగవతం (11వ స్కంధం) లో అవధూత 24 మంది గురువుల నుండి జ్ఞానమార్జించాడు. ఇందువలన వేరువేరు గురువుల రూపాలు, విధానాలు - వేరువేరు జాతి పువ్వులలాగా స్థూలదృష్టికి భిన్నంగా కనిపించినా, వారందరిలో వున్న జ్ఞానమనే తేనె ఒక్కటేనన్న వివేకం శిష్యులకు కల్గుతుంది. అప్పుడే సంప్రదాయ భేదాలు, తగువులూ వుండవు. " ఆనోభద్రాః క్రతవోయాన్తు విశ్వతః" " ఉత్తమమైన భావాలు మాకు అన్ని దిక్కుల నుండీ లభించుగాక!" అన్నదే వేద ఋషుల ప్రార్థన.

ఇలా అనేకమంది మహనీయులను సేవించగల్గాలంటే మొదట ఈ సూత్రమెంత ప్రశస్తమైనదో తెలిసి దానిపట్ల అత్యంత శ్రద్ధకలగాలి; తరువాత పూర్ణులైన మహనీయులెలా వుంటారో తెలుసుకోగలగాలి! లేకుంటే ఆధ్యాత్మ విద్యపై ఆశతో మహనీయులమని చెప్పుకునే ప్రతివారినీ నమ్మి, సేవించి, అన్నివిధాలా ప్రక్కదారిపట్టే ప్రమాదముంటుంది. అందుకే మనలో యిలాంటి సంస్కారం దృఢంగా నాటుకోడానికి వ్యాసుడు భాగవతంలో అనేకమంది మహనీయుల చరిత్రలను పొందుపరిచాడు; తమిళదేశంలో " పెరియపురాణ" మనే గ్రంథంలో అరవై ముగ్గురు శైవసిద్ధుల గురించి భక్తులు చదువుతారు. అలానే 'అళ్వారులు' అను 12 మంది మహాత్ముల చరిత్రలు పారాయణ చేస్తారు. మహనీయులు మరణానికి అతీతులు గనుక వారి చరిత్ర భక్తితో పారాయణ చేసేవారికి వారి అనుగ్రహం నేటికి కూడా లభిస్తుంది. ఇక ఏడురోజులలో మరణించనున్న పరీక్షిత్తుకు అందుకే శుకయోగి మరొక సాధనచెప్పక భాగవత శ్రవణం మాత్రమే చేయించారు. విజయానందుడనే సన్యాసి మరణించనున్న రోజులలో శిరిడి సాయిబాబా కూడా తరింపుకు భాగవత పారాయణ చేయించారు.

ఈ ఉత్తమ సత్యాన్ని గుర్తించకుంటే శుకుడు, సాయిబాబాలకంటే మనకే ఎక్కువ తెలుసని భ్రమించి అనేకమంది మహాత్ముల చరిత్ర పారాయణమనే సాటిలేని సాధనమును మనం అలక్ష్యం చేస్తున్నాము. మహాత్ముల చరిత్రలు మరియు బోధలు శ్రద్ధతో పారాయణ చేయడంవారి ప్రత్యక్ష సాన్నిధ్యంతో సమానమని శ్రీ రమణమహర్షి కూడా చెప్పారు. రెండవ దత్తావతారమైన శ్రీ నృసింహసరస్వతీ స్వామి తమ గురించి 'శ్రీగురుచరిత్ర' గ్రంథం రూపంలో తామే వుంటామని, అది పారాయణ చేసినవారికి ఇహపరశ్రేయస్సు, తమ

అనుగ్రహము తప్పక కల్గుతాయని ప్రమాణం చేసి చెప్పారు. ఇతర మతాలలో గూడ ఈ సంప్రదాయమే వున్నది. బైబిల్ మరియు ఖురాన్‌లలో ఎక్కువ భాగం ఆయా జాతులలో వెలసిన 'ప్రవక్తలు' అనబడు మహనీయుల చరిత్రలుంటాయి. అందుకే ఆయా మతస్థులు వాటిని శ్రద్ధగా చదవాలని విధించారు.

కన్నడదేశంలోని ప్రఖ్యాత మహాత్ములైన శ్రీగురు సిద్ధారూఢస్వామి ఆధ్యాత్మిక చక్రవర్తియైన సాయిబాబాకు సమకాలీనులు. ఒకసారి సాయి సన్నిధికి ఒక వ్యక్తి రాగానే బాబా " వీరు ఒక పెద్ద మహాత్ముని కొలువుకు చెందినవారు" అన్నారు. అతను గురుసిద్ధారూఢ స్వామి శిష్యుడవడమే విశేషం. మరొక ప్రస్తావన ఏమిటంటే గజానన్ పట్టేకర్ అను యువకునికి 8వ ఏటనే ఉపనయనం చేశాక, అతని తండ్రి అతనికి మహనీయుల దర్శనము, ఆశీస్సులు లభింపచేయాలనుకున్నాడు. అతనిని తీసుకొని షహపూర్ సమీపంలోని నది ఒడ్డున వున్న ఉదుంబర వృక్షం క్రింద విడిది చేసిన ముగ్గురు సాధువుల వద్దకు తీసుకువెళ్ళి వారికి నమస్కారం చేయించాడు. గురుకృప పొంది పట్టేకర్ మహనీయుడు కాబోతాడని వారిలో ఒక సాధువు ఆశీర్వదించాడు. తర్వాత అతని కుటుంబానికి సుపరిచితుడైన నానా చాందోర్కర్ శిరిడీ దర్శించినపుడు బాబా, " నీ మిత్రుని కొడుకు గజానన్ నన్ను షహపూర్‌లో నది ఒడ్డున ఉదుంబర వృక్షం క్రింద దర్శించుకున్నాడు. నేనపుడతనిని ఆశీర్వదించాను. అపుడు నాతో కూడా హుబ్లీ నివాసియైన గురు సిద్ధారూఢులు, కళ్యాణ్ నివాసియైన రామ మారుతీస్వామి కూడ వున్నారు. నీవుగూడ అవకాశమున్నప్పుడల్లా అక్కడ నదిలో స్నానం చేసి అచటి నా స్థానాన్ని గూడ దర్శించుకో" అన్నారు.

ఆ మాటవిని ఆశ్చర్యచకితుడై, నానా చందోర్కర్ బాబా యిచ్చిన పాలకోవాను బ్రహ్మచారి గజానన్ పట్టేకర్‌కు తీసుకువెళ్ళి యిచ్చాడు. ఆ తర్వాత చందోర్కర్, దభోల్కర్ (హేమద్పంతు) కలిసి మళ్ళీ శిరిడీ వెళ్ళారు. అపుడు సాయి, చందోర్కర్‌తో 'మీ గజానన్ ఆ మారుతి ఆలయంలో ఇంకెంత కాలముంటాడు?" అన్నారు. షహపూర్‌లోని ఆ ఉదుంబర వృక్షం యొక్క ప్రాశస్త్యాన్ని తెలుసుకొన్న దభోల్కర్, తాను వ్రాసిన "సాయిచరిత్ర" ప్రతిని దాని క్రిందవుంచి పూజించాడు. అంగోన్‌కవాడ్‌కు చెందిన సఖారాం మహరాజ్, గాడ్గే మహరాజ్ మొదలగు మహాత్ములు గూడ ఆ చెట్టుక్రింద తపస్సు చేసుకున్నారు. తర్వాత సాయి చెప్పినట్లే గజానన్ పట్టేకర్ ఎందరో మహనీయులను దర్శించి, రత్నగిరి జిల్లాలోని పటగాం నివాసియైన శ్రీదాదా మహరాజ్ అను మహనీయుని అనుగ్రహానికి పాత్రుడై, తర్వాత గజానన్ మహరాజుగా ప్రసిద్ధికెక్కాడు. అలనాడు సాయితో కలిసి ఉదుంబర వృక్షం క్రింద అతనికి దర్శనమిచ్చిన రామమారుతీ మహరాజ్ సాక్షాత్తూ మారుతియేనని చెప్పి, అక్కల్‌కోట స్వామి గూడ కొందరు భక్తులను వారి దర్శనానికి పంపేవారు. ఈ రామమారుతీ మహరాజ్ తమ భక్తులతో శ్రీగురు సిద్ధారూఢులు, శ్రీ సాయిబాబా వేరుకాదని తెల్పే ఎన్నోఅనుభవాలు చెబుతుండేవారు. ఇంతటి మహనీయులైన శ్రీసిద్ధారూఢ స్వామి వారి అద్భుత చరిత్ర భక్తుల హృదయాల్లో జ్ఞానజ్యోతిని వెలిగించుగాక!

## శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర

ప్రతులు:- శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్,

M.M.Donka, Ongole-2. Ph : 08592-233271

# శ్రీ భరద్వాజ లేఖామృతము



OM SADGURU SRI SAINAADHAYA

E. Bharadwaja M.A.,
DWARAKAMAYI
P.O. VIDYANAGAR-524413
Nellore Dt. (A P.)

Date 11-5-78



# శ్రీ భరద్వాజ లేఖామృతము

*E.Bharadwaja*, M.A
Dwarakamayi,
P.O. Vidyanagar-524413
Nellore Dt. (A.P.)

సోదరి శ్రీమతి కమలారామచందర్ గారికి,

భరద్వాజ నమస్కారములు, ఇక్కడ మేమంతా క్షేమం, 8.5.న వ్రాసిన జాబు మాత్రమే చేరినది. 23.04.78న శంఖుస్థాపన గొప్పగా జరిగినది. శ్రీశైలంనుండి స్వామి పూర్ణానందగారు వస్తే శంఖువుకు అభిషేక సమయానికి గంగ, కృష్ణ, గోదావరి, తుంగభద్ర జలాలు వచ్చినవి. అలానే సాయి స్వయంగా మహల్సాపతిగార్కి పెట్టిన విభూతి చిన్న ప్యాకెట్ శంఖువులో వేయడానికి వచ్చినది. హిందువులు, క్రైస్తవులు, మహమ్మదీయులు వారి వారి ప్రార్థనలు చేసారు. తర్వాత భజన జరిగినది. 23న సుమారు 2000మందికి షడ్రసోపేతమైన భోజన సంతర్పణ జరిగినది................. సత్సంగంలో పాల్గొంటున్నవారంతా వచ్చి శ్రమదానం చేసారు. మీరూ.............. ఉంటే బాగుండేదనిపించినది.

భక్తులు 'శ్రీ సాయి లీలామృతము' చేత ఆకర్షితులవడం బాబా దయ. అది చదివినవారు మీ ఏరియాలోగాని కొందరయినాక వారంలో మీకనువయినప్పుడు సత్సంగం చేస్తే బాగుంటుంది. సాయికృప చాలా బలవత్తరంగా అనుభవానికి రాగలదు. అంతేగాక సాయి సంకల్పించిన జగద్హితం త్వరగా నెరవేరగలదు. అలా శ్రేయస్సు జరగటము కలసివచ్చే పని యింకొకటి లేదు. సత్సంగమంటే .............. బాబా చరిత్ర చదవడం, తర్వాత భోజన లేక పూజ, నివేదన. బాబా............. అయ్యాక 'The Supreme Master' (Indtroduction విడచి) బాగుంటుంది. నగర వాతావరణంలో మార్పు కలుగగలదు.

లీలామృతం ప్రతి రూ.10/- వి.పి.పి ఛార్జి రూ.3/-, రిజిస్టర్ బుక్ పోస్టు 2/60. నేను వ్రాసిన పుస్తకాలన్నీ మీరు ................ అవి పునర్ముద్రణయ్యాక తప్పక మీకు ప్రతి పంపుతాను. సాయి దయవల్ల మీ ఇంటి పని త్వరగా అగుగాక!

మీ వదిన, పాప క్షేమం, మీ చిరంజీవులు క్షేమమని తలుస్తాను. రామచందర్‌గార్కి నమస్కారములు. మీ అభిమానానికి కృతజ్ఞుడను. మందిర నిర్మాణకార్యం జూన్ మొదటి వారాంతములో ఆరంభమవుతుంది. అందుకవసరమైన 55,000/-లలో 30,000/- వసూలైంది. మిగిలినది వసూలు చేసే యత్నం జరుగుతున్నది. మేమంతా ............. నుండి 6వ తేదిలోగా తిరుపతిలో ఎగ్జామ్ డ్యూటీ పూర్తిచేసుకొచ్చేస్తాము. ఆ తర్వాత ఆరంభిస్తాము.

ఇంతే సంగతులు

ఇట్లు
సోదరుడు
భరద్వాజ

# శ్రీ అక్కల్‌కోట మహారాజ్

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

## (స్వామి సమర్థ శ్రీ అక్కల్‌కోట మహరాజ్ ఆరాధన మహోత్సవ సందర్భంగా)

మానవ చరిత్ర పొగుగునా దేముడున్నాడని విశ్వసించి జీవింపజూచేవారూ, అట్టి విశ్వాసమవసరంలేదని, ధర్మంగా జీవిస్తే చాలనీ తలచేవారూ ఉన్నారు. భగవంతుడు ఇంద్రియాలకు, మనస్సుకూ గోచరించడు గనుక, సామాన్యులకెన్నడూ ఆయన ఉనికిని నిరూపించే అనుభవాలుండవు గనుక అట్టి విశ్వాసము, భక్తి ధృడమవడం అస్తికులకు కష్టం. అట్టిది ప్రసాదించమనే అందరూ అయనను ప్రార్థింపజూస్తారు. కానీ ప్రార్థన విశ్వాసంపైన, విశ్వాసం అనభవం పైన ఆధారపడతాయి గనుక అది కూడా సరిగా కుదరదు. మరొక వంక దైవవిశ్వాసమవసరం లేదని, నీతిగల జీవితమే చాలుననుకునే వారికి కూడా నీతిగా వుండడమెందుకు సరియైనదో స్పష్టంగా తెలియదు. బలహీనమైన ప్రాణులను తరిమేసి, హింసించీ బలవంతమైన ప్రాణులు జీవించడమే ప్రకృతియంతటా చూస్తాము. మానవ సమాజంలోనూ అదే కనిపిస్తుంది. అటువంటప్పుడు నిస్వార్థమైన జీవితమెందుకు ప్రశస్తమైనదో సహేతుకంగా తెలుపలేరు. జడపదార్థానికి సుఖదు:ఖాలు, దానధర్మాలూ ఉండజాలవు. ఒక్కొక్క దేహానికి పరిమితమైన ఆత్మలుంటాయని తలచినా పై జెప్పిన ప్రాకృతిక జీవితమే సమంజసమవుతుంది. సర్వజీవులకూ ఆత్మ ఒక్కటే అయితే మాత్రమే సాటి వారిని తన వలె ప్రేమించడం - అంటే నీతిగా బ్రతకడం హేతుబద్ధము, వాంఛనీయము అవుతుంది. అంటే శుద్ధమైన ఆధ్యాత్మికతనంగీకరించక నైతక జీవితం సహజము,సమంజసమూ కాజాలదు. అందుకే ధృడమైన దైవ విశ్వాసం లేనిదే అటు ఆస్తికులకు, ఇటు నాస్తికులకు గూడా నైతిక జీవితం కృత్రిమంగా వుండిపోతుంది గాని ఆత్మ పరిపాకాన్ని కలిగించదు. అట్టి విశ్వాసం లేని మానవతావాదం గూడా మానవ జాతి కల్పించుకున్న స్వర్గనరకాది భావాలవలె అంధ విశ్వాసమౌతుంది. అందుకే నీతిని వాచా ప్రవచిస్తూ గూడా ఆచరణలో ఎక్కువమంది విఫలులవుతారు.

అయితే ఆస్తికుల మనుకునేవారు గూడా ఆత్మ సర్వగతమన్న అనుభవం లేకపోవడం చేత అట్టి దుస్థితిలోనే చిక్కుతారు. ధృఢమైన దైవ విశ్వాసం కలగాలన్నది అనేక కోరికలలో ఒక్కటిగా మాత్రమే మిగులుతుంది. దీనినే ఆధ్యాత్మ పదజాలంలో ఇలా చెప్పవచ్చు. పరమాత్మ ఇంద్రియ మనస్సులకు ప్రత్యక్షంగా గోచరించడు. అందుకని సామాన్యంగా అనుభవంగాదు. అందుకని ధృఢమయిన విశ్వాసం కలగడం కష్టం. అనుభవముంటే గాని విశ్వాసం కుదరు; ధృఢమైన విశ్వాసముంటే గాని అనుభవం కలుగదు. అటువంటప్పుడు ఆస్తికులకు ఆధ్యాత్మిక జీవనము, తదితరులకు నైతిక జీవితము ఎలా సంభవము?

ఇందుకు సమాధానం మహనీయులు, మత గ్రంథాల వలన లభిస్తుంది. మానవులకు తన ఉనికిని స్వల్పంగానైనా తెలిపి, సన్మార్గానికి ఆకర్షించడానికి పరమాత్మయే ప్రేమతో బద్ధకంకణుడయ్యాడు.సృష్టి స్థితి లయకారకులు, పరమ సత్యము తానే అయిన పరమాత్మ యోగమూర్తియైన దత్తాత్రేయ స్వామిగా భూమిపై అవతరించాడు. అంటే సృష్టి పరమాత్మకల్పించిన కావ్యమనకుంటే కల్పితమయిన ఒక ప్రధాన పాత్రగా అందులో తనను గూడా కల్పించుకొన్నాడన్నమాట. "గురు బ్రహ్మ.... " అన్న శ్లోకం ఇదే చెబుతుంది. పూర్ణపురుషుల రూపంలో మానవుల కెల్లప్పుడు భూమిపై లభ్యమయ్యేది ఈ అవతారతత్వమే. అంటే భగవంతుడు సర్వమానవ కల్యాణానికి

దత్తమయ్యాడన్నమాట. ఆత్మ సమర్పణ చేసుకున్నాడన్నమాట.

ఈ దత్తాత్రేయస్వామి ఈ యుగంలో మొదటి గోదావరి జిల్లా పిఠాపురంలో శ్రీపాద శ్రీ వల్లభులుగా అవతరించారు. తర్వాత కరంజా అనే గ్రామంలో అవతరించి శ్రీ నరసింహసరస్వతిగా గాణ్గాపురంలో ప్రసిద్ధికెక్కారు. నైజాము నవాబుల కాలంలో మాణిక్యనగర్‌లో శ్రీ మాణిక్య ప్రభువులుగాను, అట తర్వాత 1856లో శ్రీ స్వామి సమర్థులుగాను, అటు తర్వాత శ్రీ శిరిడీ సాయిబాబాగానూ అవతరించారు. ఆ మొదటి ఇద్దరి చరిత్రలు "శ్రీ సంహితాయన గురుద్విసాహస్రి గురు చరిత్ర" అను గ్రంథములో ప్రచురించడమైనది. వీరందరి చరిత్రలను శ్రద్ధాదీక్షలతో పారాయణ చేసి ముముక్షువుల పూర్ణగురుని అనుగ్రహానికి పాత్రులు కావాలి. అదే దత్త సంప్రదాయం.

మహారాష్ట్ర దేశంలోని అక్కల్‌కోట గ్రామంలో ఎక్కువ కాలం నివసించి ఆ ఊరిని గొప్పక్షేత్రంగా రూపొందించిన మహాయోగి శ్రీ అక్కల్‌కోట మహరాజ్. ఆయన కలియుగంలో శ్రీ దత్తాత్రేయుని నాల్గవ అవతారం, ఆనాటి మహాత్ములెందరో ఆయనను శ్రీ దత్తమూర్తి అవతారంగా గుర్తించారు. ఈ నాటికీ భక్తులకు ప్రత్యక్ష నిదర్శనం చూపించే శ్రీ దత్తమూర్తి పాదుకలు - గాణ్గాపూర్ లోనివి. చాలామంది భక్తులకు శ్రీ అక్కల్‌కోట మహరాజ్ దత్తమూర్తి అవతారమని నిదర్శనం యిచ్చాయి. ఉదాహరణకు బాలోజిరాజా గాణ్గాపురంలో నిష్టగా గురుచరిత్ర పారాయణ చేస్తుండగా ఒక రాత్రి స్వప్నంలో శ్రీ దత్తమూర్తి కనిపించి, "నేను మీ సంస్థానంలోనే వుండగా నీవిక్కడకు రావలసిన అవసరమేమి?" అని అడిగి అంతర్ధానమయ్యారు.

అశ్వనిమాసం 1856 (శక సంవత్సరం 1779) లో పంచమి బుధవారం నాడు శ్రీ అక్కల్‌కోటస్వామి మొదటిసారిగా అక్కల్‌కోట గ్రామంలో కనిపించారు. అప్పటినుండి సుమారు ఇరువది సంవత్సరాలు అక్కడే ఉన్నారు. వీరి అసలు పేరు, వయస్సు, తల్లిదండ్రుల పేర్లు, కులగోత్రాలు మొదలైన వివరాలు ఎవరికీ తెలియవు. ఆయన ఎవరికీ ఎప్పుడూ ఈ వివరాలు నిశ్చయంగా చెప్పలేదు. అరుదుగా అప్పుడప్పుడూ ఆయన చెప్పిన వివరాలు వున్నా కూడా అవి అన్నీ ఒకరీతిగా లేవు. ఒకప్పుడు చింతోపంత్ ఆయనను ఈ వివరాలు అడిగారు. దానికి స్వామి యిలా చెప్పారు; "నా తల్లిదండ్రులు మాదిగవారు, వృత్తి తోళ్ళపని". మరొకసారి ఒక భక్తునితో, "మేము కదలీవనం నుండి వచ్చాము"అన్నారు. కార్వే అను భక్తునితో,"నేను యజుర్వేద బ్రాహ్మణుడను, కాశ్యపగోత్రం. పేరు నరసింహభాన్, మీన రాశి, మళ్ళీ అడిగితే చెప్పుతీసుక్కొడతా" అన్నారు. మరొక భక్తుడు అడిగినపుడు పొడి మాటలతో ఇలా అన్నారు 'మూల పురుషుడు, వటవృక్షం-మూలం-మూలానికి మూలం' అని చరిత్రకారులు ఈ మాటలకర్థం యిలా చెప్పారు; శ్రీ దత్తస్వామి అంటే వృక్షం-దాని ఊడలే ఈ దత్తవతారాలన్నీ, వీరిలో శ్రీ అక్కల్‌కోట మహరాజ్ ఒకరు. కాని అసలైన అర్థం వీరి చరిత్రను బట్టిచూస్తే, కొంచెం వేరుగా కనిపిస్తుంది శ్రీ దత్తాత్రేయుని అంశావతారాలుగా కొలవబడిన అనేక మందికి వీరు గురువులు. అటువంటి ఊడలుగల్గిన వట వృక్షమైన మూలపురుషుడైన శ్రీ దత్తాత్రేయులే తామని చెప్పినట్లు నాకు తోస్తుంది.

శ్రీ స్వామి అనేకసార్లు తమ పేరు నరసింహభాన్ అని చెప్పడం వల్ల, తానే మూలపురుషుడైన దత్తమూర్తియని చెప్పడం వల్ల, తామొక కదళీవనం నుండి వచ్చామని చెప్పడం వల్ల, మరికొన్ని ఆధారాలవల్ల కూడా వీరు శ్రీ నరసింహ సరస్వతి స్వాములేనని చాలామంది నమ్ముతారు. శ్రీ నరసింహ సరస్వతి కొంతకాలం గాణ్గాపురంలో నివసించి, తరువాత అక్కడ తన నిర్గుణ పాదుకలను వుంచి, శ్రీశైలానికి బయలుదేరాడు. శ్రీశైలానికి సమీపంలోని కృష్ణానదిలో పూలు కనిపించడమే తాము శ్రీశైలం చేరినట్లుగుర్తు అని భక్తులకు చెప్పారు. శ్రీశైలంలో కొన్నిరోజులుండి అక్కడకు కొద్దిదూరంలో వున్న కదళీవనం ప్రవేశించినట్లు మాత్రమే తెలిసింది. ఆ తరువాత వారిని గురించిన వివరాలు ఎవరికీ తెలియలేదు.

శ్రీ అక్కల్‌కోట స్వామి చెప్పిన మాటలు ఈ వివరాలకు సరిపోతున్నాయి. అంతేగాక వారి ముఖ్య శిష్యులలో ఒకరైన శ్రీ స్వామిసుత ఒకప్పుడు చెప్పారు; శ్రీ అక్కల్‌కోట మహారాజ్ 1148 (శక సంవత్సరం 1071) లో చైత్రశుద్ధ విదియనాడు ఎనిమిది సంవత్సరాల బాలుడుగా మొదట కనిపించారని, వీరు శ్రీ నరసింహ సరస్వతి స్వాములేనని.

శ్రీ స్వామి అక్కల్ కోట చేరకముందు దేశమంతటా పర్యటించిన వివరాలు కొంతవరకు లభించాయి. హిమాలయాల్లో కొంతకాలం పర్యటించి బదరీనాథ్, కేదారనాథ్, హరిద్వార్, గంగోత్రి, వారణాసి, కలకత్తా, పూరీ, జగన్నాథ్, రాజూర్, ఉడిపి, పండరీపూర్, సహ్యాద్రి, గిర్నార్, మాతాపూర్, కర్వీర్, పాంచాలేశ్వర్, ఔదుంబర్, కరజ్‌నగర్, నరసింహవాడి, రామేశ్వరం, బేగంపూర్, మొహోల్, షోలాపూర్, మంగల్‌వేడా, గాణ్గాపూర్ మొదలైన చోట్ల అంతటా తిరిగినట్లు ఆయన చెప్పడమే గాక అప్పుడాయనను చూచినవారు కూడా ఆయన అక్కల్‌కోట చేరి ప్రసిద్ధికెక్కిన తరువాత చెప్పారు.

శ్రీ నరసింహసరస్వతిగా శ్రీశైలంలో కదళీవనం ప్రవేశించాక కొంత కాలానికి వీరు హిమాలయా పర్వతాలు చేరి, అక్కడొక అడవిలో సమాధి నిష్ఠలో మూడు వందల సంవత్సరాలు పాటు కూర్చుండి పోయారు. ఆయనను పుట్టలు పూర్తిగా కప్పివేశాయి. ఆయన ప్రక్కనే ఒక పెద్ద చెట్టుకూడా మొలిచింది. కొంతకాలానికి అడవిలో కట్టెలు కట్టుకొనే వాడు ఒకడొచ్చి ఈయన వెనుక వున్న చెట్టును నరికే ప్రయత్నంలో ఆ గొడ్డలి పెట్టుకు పుట్టలోని ఒక భాగంనుంచి నెత్తురు కారింది. అపుడు అతడాశ్చర్యంతో ఆ ప్రక్క పుట్టను తొలగించగా సమాధి నిష్ఠలో వున్న స్వామి మేల్కొన్నారు. నెత్తురు ఆయన తొడనుంచి కారుతున్నది. అది చూచి మహాభయంతో అతడు ఆయనను శరణు వేడాడు. అప్పుడు స్వామి అతనికి అభయమిచ్చి, ఈ సంఘటన తన అవతార కార్యాన్ని కొనసాగించమన్న దివ్య ప్రభోదంగా తీసుకుని తన పర్యటన ప్రారంభించారు. ఇది స్వామి అక్కల్‌కోట రావడానికి సుమారు వంద సంవత్సరాల పూర్వం జరిగిన సంఘటన. ఆ తరువాత వీరనేకచోట్ల ప్రజలచేత అనేక పేర్లతో పిలువబడుతూ చివరకు అక్కల్‌కోట స్వామిగా వెలిశారు. తన గత చరిత్ర గురించి స్వామి స్వయంగా చెప్పినవి ఒకటి రెండు కంటే ఎక్కువ వివరాలు లేవు. కర్ణాటక దేశంలో మహర్‌గడ్ అనే చోట శివుడి అవతారంగా కొలువబడిన 'చిదంబరస్వామి' ఒకరుండేవారు. ఆయన దేశమంతటా అన్నపానీయాలు కొరతగా వుండే రోజుల్లో గూడా యజ్ఞాలు చేసి లక్షలాది జనానికి తనయోగ శక్తితో అన్నదానం చేసేవారు. ఆ యజ్ఞాలలోనూ, అన్నదానంలోనూ తాము స్వయంగా నేయి అందించినట్లు అక్కల్ కోట స్వామి ఒకప్పుడు చెప్పారు. మరొకప్పుడు తాను నిపాణిలో వున్నామని చెబుతూ, 'భూధర్‌ఘడములోని బాబా యింకావున్నారా లేదా?" అని ఎవరినో స్వామి అడగడం జరిగింది.

వీరి దేశపర్యటనలో అనేకచోట్ల వీరు ప్రదర్శించిన అద్భుత లీలలు కొన్ని తెలియవచ్చాయి. పుణ్యతీర్థాలలో యాత్రికులను పీడించే పూజారులకు తమ శక్తి ప్రదర్శనచేత బుద్ధిచెప్పిన సంఘటనలు కొన్ని, పెద్దపులి, లేడి వంటి వన్యమృగాలతోగూడా మాట్లాడి వాటి పూర్వజన్మ వృత్తాంతాన్ని చెప్పి ఎటువంటి పూర్వ పాపాలు ఇటువటి హీనజన్మను వాటికి కలిగించాయో వాటికెరుకపరచి, వాటికి ముక్తినిచ్చిన సంఘటనలు కొన్ని. మచ్చుకి హరిద్వార్‌లో జరిగిన ఒక సంఘటన వల్ల దుష్టులను సైతం శిష్టులుగా ఎలా మార్చారో తెలుస్తుంది. హరిద్వార్‌లో ఇద్దరు పహిల్వాన్‌లు బల గర్వంతో ఊరిలోని వారిని, యాత్రికులనూ పీడిస్తుండేవారు. కొంతకాలానికి ఘోరమైన వ్యాధులకు గురి అయ్యారు. వారు చేసిన పాపాలకు తగిన శాస్తి జరిగిందని ఊరిలోని వారంతా సంతోషించారేగాని వీరినెవరూ ఆదుకోలేదు. వారు గూడా గతంలో చేసిన పాపాలకు పశ్చాత్తాపం చెంది జీవితాన్ని భగవన్నామ స్మరణతో పునీతం చేసుకోవడానికి ప్రయత్నించారు. కొందరు భక్తులతో భోజనం చేస్తూవున్న శ్రీ స్వామికి వారి మీద అకస్మాత్తుగా కనికరం కలిగి మనోవేగంతో వారి

దగ్గరకెళ్ళారు. భోజనం మధ్యలో లేచివచ్చిన స్వామిని చూచి ఆశ్చర్యపడుతూ స్వామిని, "మీరెవరని" పహిల్వాన్ అడిగారు. "నేనెవర్నైతే మీకెందుకు? ముందుర మీ సంగతి చెబుతాను వినండి". అని స్వామి వారి పాపాలనన్నింటినీ ఏకరువు పెట్టి, చివరికిలా అన్నారు; 'మూర్ఖులారా! బ్రాహ్మణ జన్మెత్తి గూడా యిన్ని పాపాలు చేసింది చాలక నిన్న రాత్రి రహస్యంగా ఆవును చంపలేదా?' అనడిగారు. ఆయన సర్వజ్ఞత్వానికి నివ్వెరపోయి వారాయన పాదాల మీద పడ్డారు. వెంటనే స్వామి వారితో కూడా ఆ చచ్చిన ఆవు దగ్గరకు వెళ్ళి దానిమీద తీర్థం జల్లి తట్టేటప్పటికి ఆవు తిరిగి జీవించింది. అంతటితో జనమంతా ఆయన పాదాల మీద పడి మొక్కారు. కొందరు ఆశ్చర్యంతో. "తమరెవరు?" అని ప్రశ్నించారు. "నేను వటవృక్షం-దత్తనగరం" అని సమాధానమిచ్చారు. కొందరికి సంశయం తీరక వేదం వల్లించమని అడిగారు. అప్పుడు స్వామి నాలుగు వేదాలలో నుంచి వారెక్కడడిగితే అక్కడ వప్పజెప్పి వారి సందేహాన్ని తీర్చారు.

స్వామి అనేకమంది యోగులకు కల్గిన చిక్కులను కలల్లోనే తీర్చి యోగసిద్ధి ప్రసాదించిన సంఘటలున్నాయి. ఒక గుహలో శ్రీ దత్తాత్రేయుని సాక్షాత్కారం కోసం ఒక యోగి పదహారు సంవత్సరాలు తపస్సు చేసారు. అతని తపస్సుకు మెచ్చి శ్రీ దత్తమూర్తి ఆయనకు స్వప్నంలో కనిపించి, "రేపు నేను నీ గుహ ద్వారంలో దర్శనమిస్తాను" అని చెప్పి అంతర్థానమయ్యారు. మరుసటి ఉదయం యోగి దర్శనం కోసం వేచియుండగా గుహద్వారం దగ్గర ఒక పెద్దపులి కన్పించింది. దానిని చూచి ఆ యోగి భయపడుతుండగా శ్రీ స్వామి అక్కడకొచ్చి అభయమిచ్చి, ఆశీర్వదించి, అదృశ్యులయ్యారు.

మోహోల్‌లో ఐదు సంవత్సరాలుండి తిరిగి తిరిగి స్వామి షోలాపూర్ చేరారు. అక్కడ ఒక దత్తమందిరంలోకి వెళ్ళి ఒక మూల చిన్నపిల్లవాడిలా ఆడుకుంటున్నారు. ఆలయానికి వచ్చిన ఒక భక్తుడు చింతోపంత్ స్వామి తేజస్సును చూచి ఆయనొక సిద్ధపురుషుడై వుండవచ్చునని మనసులో అనుకున్నాడు. వెంటనే స్వామి అతనికేసి చూసి, "నేను సిద్ధపురుషుణ్ణో, మరొక పురుషుణ్ణో నీకెందుకు?" అన్నారు. వెంటనే ఆయనకు సాష్టాంగపడి చింతోపంత్ ఆయనను తన ఇంటికి భోజనానికి రమ్మని ప్రార్థించాడు. ఆ రోజే పంత్ మరికొంతమందిని ఆ భోజనానికి ఆహ్వానించాడు. భోజన సమయానికందరూ సమావేశమయ్యారు. దాదాజీ అనే అతిథి స్వామివాలకం చూచి ఏవగించుకొని, చింతోపంత్ చెవిలో ఇలా అన్నాడు. " ఏ నియమాలు ఆచరించని ఈయననా నీవాహ్వానించింది? ఆయన పంక్తిని కూర్చొని భుజించడం మనవంటివారికి తగదు". క్షణకాలం చింతోపంత్ మనస్సుకి ఆ మాట నిజమేననిపించింది. మరుక్షణమే వాకిట్లోకూర్చున్న స్వామి లేచి, "నీ మనస్సులో వికల్పం కలిగింది. నేను వెళ్ళిపోతున్నాను". అని బయలుదేరారు. పంత్ తన తప్పును గ్రహించి క్షమాపణ కోరాడు. స్వామి క్షమించి ఉండిపోయారు.

మరికొన్నాళ్ళకి స్వామిని పంత్ మరొకసారి భోజనానికి ఆహ్వానించాడు. స్వామి వచ్చారుగాని ఎంతసేపటికీ కంచం ముందు కూర్చోలేదు. ఆయన తింటేగాని ఇంట్లో ఎవరూ భోజనం చేయడానికి వీల్లేదు. షోలాపూర్‌లో కలెక్టరు ఆఫీసులో పనిచేస్తున్న చింతోపంత్ కుమారుడు దాజీబా ఆఫీసుకు ఆలస్యమౌతుందని తొందరపడుతున్నాడు. చివరికి గత్యంతరం లేక చింతోపంత్ అతనిని ముందు భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళమన్నాడు. కాని దాజీబా ఏది ఏమైనప్పటికీ స్వామికంటే ముందు భోంచేయరాదని నిర్ణయించుకొన్నాడు. పదకొండు గంటలకు స్వామి భోంచేశారు. తొందరగా దాజీగూడా భోజనం ముగించి స్వామి దగ్గర శెలవు తీసుకొని ఆఫీసుకు వెళ్ళాడు. త్వరత్వరగా ముగించి స్వామి దగ్గర శెలవు తీసుకొని ఆఫీసుకు వెళ్ళాడు. త్వరత్వరగా హెడ్ గుమస్తా దగ్గరకు వెళ్ళి తన ఆలస్యానికి దాజీ క్షమాపణ చెప్పుకున్నాడు. అంతులేని ఆశ్చర్యంతో హెడ్ గుమస్తా దాజీకి హాజరుపట్టి చూపించాడు. తాను రాకముందే తన

సంతకం హాజరు పట్టీలో ఉండడంచూచి, దాజీ అది స్వామి మహిమ అని వెంటనే గుర్తించాడు. ఈ సంఘటన జరిగింది 1856లో. సరిగ్గా ఇటువంటి సంఘటనే శిరిడి సాయిబాబా చరిత్రలోను, తాజుద్దీన్ బాబా చరిత్రలోనూ కూడా చూడవచ్చు. కొద్దికాలంలో ఉద్యోగం నుండి రిటైరయిన చింతోపంత్‌కు అక్కల్‌కోట సంస్థానంలో మంచి ఉద్యోగం దొరికింది. ఆయన స్వామిని తనతో అక్కల్ కోట రమ్మని ప్రార్థించాడు. " ఇది వేసవికాలం. వేడి ఎక్కువగా ఉన్నది.వర్షాలు కురిశాక వస్తాను" అన్నారు స్వామి. పంత్ ఒక్కడే వెళ్ళి ఉద్యోగంలో చేరాడు. కొద్దిరోజుల తరువాత అక్కల్‌కోట రాజు చనిపోయారు. ఆయన తమ్ముడు రాజైనారు. పెద్ద వర్షం కురిసింది. ప్రకృతి అంతా పచ్చగా అందంగా ఉన్నది. సంచారియైన స్వామి అక్కల్‌కోట చేరారు.

సాయికి-స్వామికీ గల తాదాత్మ్యం యీనాటికీ సత్యమే. శ్రీమతి వెంకటరత్నమ్మ యిలా వ్రాస్తున్నారు : "ఆచార్య భరద్వాజగారొకసారి నేను స్వామి చరిత్ర పారాయణ చేస్తే మనస్సుకు శాంతి కలుగగలదని చెప్పారు. కనుక మాష్టర్‌గారు వ్రాసిన స్వామి చరిత్ర వ్రాత ప్రతిని తెప్పించి చదువనారంభించాను. కొద్దిరోజుల క్రితం ఆజానుబాహుడైన కౌపీనధారి ఒక యిత్తడి పాత్రచేత బట్టుకొని నాకు స్వప్న దర్శనమిచ్చారు. వారు స్వామి సమర్థులని నాకు గట్టిగా తోచింది. అయితే నేనప్పటికి వారిచిత్రాన్ని గూడ చూడలేదు. "నీవు నాకు పావుశేరు పాలు సమర్పించాలి!" అన్నారు. నేనలా మ్రొక్కుకోలేదు గనుక ఆ మాటలకర్థం తెలియక మాష్టర్‌గారికి కబురు చేశాన తరువాత గురువారం స్వామికి పాలు నివేదించమని వారు కబురు చేశారు. గురువారం నేను పాలు కాస్తుండగా కొద్దిరోజులు తమ కుమార్తె ఇంట వుండి అప్పుడే వచ్చిన మా అత్తగారు ఆ సమయంలో పాలెందుకు కాస్తున్నావని అడిగారు. స్వప్న సందేశం గురించి విని తనకు సుస్తీ చేసినప్పుడు తనకు త్వరగా స్వస్తత చేకూరితే పావుశేరు పాలు నివేదిస్తానని శ్రీ సాయిబాబాకు మ్రొక్కుకున్నానని చెప్పారు. కాని మ్రొక్కు చెల్లించమని కోరింది స్వామి సమర్థులు.

ఈ యిద్దరు గరుమూర్తులకూ గల తాదాత్మ్యాన్ని బలపరుస్తున్నాయా అన్నట్లు వారి చరిత్రలు ఎంతగానో పోలివుండడం మనమీరీతిన గుర్తించవచ్చు.

1) ఇద్దరి జననము, తల్లిదండ్రులు, కుల గోత్రాలు, స్వస్థానాలు ఎవరికీ తెలియవు. 2) ఇద్దరూ సాధకావస్థలేని పరిపూర్ణులు గానే ప్రకటమయ్యారు. 3) సాయి రెండవసారి వచ్చి శిరిడీలో స్థిరపడిన సంవత్సరమూ, స్వామి అక్కల్‌కోట వేంచేసిన సంవత్సరమూ ఒక్కటే. 4) ఇద్దరూ స్థానిక ఖండోబా ఆలయాల వద్దనే ప్రకటమయ్యారు.5) శ్రీ సాయిని మొదట చాంద్‌పాటిల్ అనే ముస్లిం సేవిస్తే, సమర్థులను, మరో ముస్లిం గుర్తించి ఆదరించారు. 6) ఇద్దరూ సంకల్ప మాత్రం చేతనే చిలిమ్‌కు అగ్నిని సృష్టించారు. ఈ సారూప్యం వీరిద్దరి సమకాలికులైన షేగాంవ్ నివాసియైన శ్రీ గజానన్ మహరాజ్ గారికి కూడా వర్తించడం గమనార్హం. 7) ఇద్దరూ మడివంటి బాహ్యాచారాన్ని పాటించలేదు. అనికేతులై కులమత భేదాలను ధిక్కరించారు. 8) వీరి దైవత్వాన్ని పశుపక్ష్యాదులు కూడా గుర్తించి పరివర్తన, సద్గతి చెందాయి. 9) వీరు భక్తులను అనుగ్రహించడంలో తిట్లు, దెబ్బలు వంటి సంకేతాలను, విచిత్ర మార్గాలనూ అవలంబించారు. 10) స్వామి, సాయి-యిద్దరూ వేపచెట్టు మూలాన్ని ఆశ్రయించారు. వారే కొమ్మల క్రింద కూర్చొన్నారో వాటి ఆకులు మాత్రం తియ్యనైనాయి. 11) వీరిద్దర్నీ సన్నిహితంగా సేవించిన చోళప్ప - సుందరాబాయిలు, శ్యామా - రాధాకృష్ణ మాయిలు ఒకరినొకరు ఎంతగానో పోలివున్నారు. 12) ఇద్దరూ సకల దేవతలూ తామేనని భక్తులకు నిదర్శనమిచ్చారు. వారి సర్వజ్ఞత్వము, విశాల ప్రకృతిపైన సంపూర్ణ ఆధిపత్యమూ సుస్పష్టం. 13) వారి మహాసమాధిని గూర్చి యిద్దరూ ముందుగానే భక్తులకు తెల్పుతూ వచ్చారు. 14) వీరిద్దరి తాదాత్మ్యమూ ఎప్పటికీ సుస్థిరమే.

---

# సాయిబాబా - మంత్రోపదేశం

**- ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

ఒకసారి శిరిడీలో ఒక సాయి భక్తుడు కనిపించి నాసిక్ వెళ్దామని వేధించాడు. చివరికి తప్పక ఆయనతో కూడా వెళ్ళాను. అక్కడ గోదావరిలో ఇద్దరమూ స్నానం చేస్తున్నాము. నేను ముమ్మారు మునిగి లేచేసరికి ప్రక్కన నిల్చున్న అతడు ఫటాలున నా తలపట్టుకొని చెవిలో, "సాయిరామ్, సాయిరామ్" అని మూడుసార్లు గొణిగి విడిచాడు. ఏమిటి అలా చేసారు? అన్నాను. "నీకుపదేశం చేసాను!" అన్నాడు. నాకు వళ్ళు మండింది. తర్వాత వివిధ రీతులలో సాయి నామాన్ని భక్తులకు మంత్రంగా ఎందరో ఉపదేశిస్తున్నారని తెలుస్తున్నది.

1) సాయినాధుడు తమ సాంప్రదాయంలో చెవిలో మంత్రమో, నామమో ఉపదేశించడమన్నది లేదని ఘంటాపదంగా చెప్పారు. అటువంటిది ఆయన నామాన్నే ఉపదేశించడమనేది ఎంతటి ఘోరం! "మహాత్మాగాంధీ బ్రాందీషాపు" అన్న బోర్డుతో పానశాల నిర్వహించడమేగదా యిది! అంతేకాదు, "ఎన్నడూ ఉపదేశంకోసం పరుగెత్తవద్దు" అన్నదే సాయి ఉపదేశం. ఆయన ప్రత్యక్ష భక్తులు గూడ సాయి ఉపదేశించరని వేరొకరిని ఉపదేశంకోసం ఆశ్రయించదలిస్తే గూడ సాయి అనుమతించలేదని సమగ్రంగా సాయి చరిత్ర గ్రంధాలన్నింటినీ తరచిన వారికి తెలుస్తుంది. అటువంటప్పుడు యీ భక్తులిలా చేయడం ఎంతటి దౌష్ట్యం, ఎంతటి అజ్ఞానం! అందుకే సాయి దానిని అంత ఖచ్చితంగా నిషేధించారు.

దీనిని యింకొంచెం వివరిస్తేగాని సాయి భావమేమో అర్థంగాదు. ఉపదేశమన్నది చాలా గంభీరమైన విషయం. అజ్ఞానియైన శిష్యుడు తనకు దూరంగా ఎక్కడో ఉన్నాడని భ్రమించిన దైవం వాస్తవానికి అతనిచెంతనే వున్నారనే ప్రత్యక్షానుభవాన్నివ్వడమే ఆ మాటకర్థం. అంటే "దేముడున్నాడా? ఉంటే ఎక్కడున్నాడు? నాకు చూపగలవా?" అనడిగిన వివేకానందుడికి తన పాద స్పర్శచేత రామకృష్ణ పరమహంస అతడికి పరమాత్మానుభూతిని ప్రసాదించడం ఉపదేశమంటే.

ఇలా జరగాలంటే రెండు పరిస్థితులు సమకూడాలి: 1) గురువు పూర్ణుడు గావాలి. సంకల్పమాత్రాన శిష్యుడికి అనుభవాన్ని ప్రసాదించగల్గాలి. 2) శిష్యుడు అంతటి ముముక్షువు, విరాగి కావాలి, అందుకే ఒక్కరామకృష్ణ వంటి మహనీయులు మాత్రమే వివేకానందుని వంటి కొద్దిమంది శిష్యులకు మానవ చరిత్రలో అట్టి అనుభవాన్ని ప్రసాదించగలిగారు. అలాటివారెందరున్నారు? అందుకే ఎందరెందరో మరెందరికో ఉపదేశాలు చేసినా అవి నామమాత్రమేగాని సార్థకాలుకావు. అంతటి అర్హత లేనివారు అర్హతలేని వారికి ఉపదేశాలు చేసి అవతలవారిని గురుత్వాలపేరిట వశంలో వుంచుకోడాన్ని సాయి నిరసించారని మనం గుర్తించాలి.

సాయివంటి సద్గురువు భగవత్స్వరూపి. ఆయన సాన్నిధ్యంలో భక్తులెలాటి స్థితిననుభవించారో 'శ్రీ సాయిలీలామృతము'లో శ్రీమతి మేనేజరు, సగుణమేరునాయక్ వంటివారి అనుభవంలో చూడవచ్చు.

అనుక సాయి దర్శనమే ఉపదేశం. సాయి తమకూ తమ మూర్తికీ భేదం లేదని నిరూపించారు. సాయి చరిత్ర గ్రంధాలను విస్తారంగా భక్తులు చదివి వారి తత్వం శల్యగతమై, వారి పటాన్ని వారి ప్రత్యక్ష రూపంగా సేవించుకొంటూ వారి నామస్మరణ చేస్తూ, వారి బోధనల గూర్చి 'శ్రీ సాయి ప్రభోదామృతము'లో సూచించిన రీతిన మనన, ఆచరణలకోసం యత్నిస్తుండడమే సాయి సాంప్రదాయము. సాయి చరిత్ర, బోధలను విస్తారముగా తాము చదవక, తెలుసుకొనక వారు చేసే యిలాటి వారి తప్పడు ప్రచారాలు కలిధర్మమేనని తోస్తున్నది. వీరికి తాము చెప్పేదానిమీద మమకారమేర్పడి, తాము సాయి భక్తాగ్రేసరులమన్న అహం పొడసూపి అటుతర్వాత తాము ప్రచారం చేసేది అసత్యమని అందరికీ తెలియడంవలన తమకు యిబ్బంది యున్నదని తలచి, వివిధ సాయి చరిత్ర గ్రంధాలను విస్తారంగా తమ అనుయాయులను చదవనివ్వకపోవడం గూడ ఒక దుష్ట సాంప్రదాయంగా యీనాడు ఏర్పడుతూండడం శోచనీయం.

2) అలానే కొందరు భక్తులు తామెన్నుకొన్న, లేక తమకు సాయి సన్నిధిలో హృదయంలో ప్రేరేపించబడిన సాయి నామం అన్నింటికంటే బలీయమైనదని, దానినే అందరు జపించాలన్న ప్రచారం గూడ సాగుతున్నది. సాయి నామాన్ని వీరు ప్రచారం చేయడం మంచిదేగాని అదే బలీయమైనదని చెప్పడం సంకుచితత్వానికి సూచన. ముందు ముందు యింకెందరో వారికి నచ్చిన సాయినామాలనలానే ప్రచారం చేస్తారు. వివిధ సాయినామాలను జపించే 'భక్తుల' మధ్య వర్గభేదాలు- శివకేశవాది భేదాల వంటివి ఏర్పడే సూచనలు కన్పిస్తున్నాయి. మతాల మధ్యనే సామరస్యమేర్పరచ యత్నించిన శ్రీసాయి భక్తులు అజ్ఞానంతో యిలాటి ముఠా తత్వాన్ని ఏర్పరచుకోవడమెంత శోచనీయం? ఒకవేళ అంతగా ఉపదేశం కావాలని భక్తులెవరైనా అనుకొంటే శాశ్వతంగా సర్వులకూ సాయి యిచ్చిన ఆదేశం "శ్రీసాయిసచ్చరిత్ర"లో వుండనే వున్నది- "సాయి సాయి అని ప్రేమ పొరలే హృదయంతో అనుకో" అంటూ! ఆ సద్గురు ముఖాన్నుండి వెడలిన ఆ సాయి నామంకంటే అధికమైనదేమున్నది? కొందరు అజ్ఞులు దానికి నగిషీలు చెక్కదలచి దానిని 'మరింత శక్తివంతం చేయడానికి' దానికి బీజాక్షరాలు, 'ఓం' వంటి బీజాలనతికించి ఉపదేశాలు చేస్తున్నారు. అలా చేయగలగాలంటే మంత్ర శాస్త్రంలో ఎంతో పరిజ్ఞానముండాలి. కేవలం శక్తి, గణపతి, దత్తాత్రేయ బీజాక్షరాలేమిటో తెలిసినంత మాత్రాన్న చాలదు. ఒకొక్క సాధకుని పూర్వజన్మ సంస్కారాలనెరిగి ఎవరికి తగ్గ దానిని వారికి ఉపదేశించగల అర్హత గలవారే ఉపదేశించ యోగ్యులు. అలాకానప్పడు అవసరమైన వారికి సాయిబాబాయే దర్శనమో, స్వప్నోపదేశమో చేస్తున్న సందర్భాలు నాకు తెలుసు. ఇక "సాయిసచ్చరిత్ర"లో చూస్తే "సాయి, సాయి" అన్న నామం చాలునని సార్వజనికంగా ఆయనయే ప్రత్యక్షంగా చెప్పిన దానికి భిన్నంగా చెప్పడం భక్తులకు తగదు.

---

# సాయి చర్యలు - ధర్మానికి దీపాలు

- ఆచార్య భరద్వాజ

వెలుగు గురించి కొన్ని గంటలుపన్యసించినా కొంచెము గూడా వెలుగు రాదు. స్విచ్ వేసినా, అగ్గిపుల్లగీచినా తృటిలో వెలుగు వస్తుంది. చుట్టూవున్న చీకటి తొలుగుతుంది. అలానే ఎన్ని శాస్త్ర గ్రంథాలు చదివినా, మనమెన్ని ఉపన్యాసాలు యిచ్చినా కలగని జ్ఞానం శ్రీ సాయిబాబా వంటి సద్గురువు చేసే ప్రతిచిన్నచర్యలోనూ సర్వధర్మాలు, శాస్త్రాలూ భాసిస్తాయి. మనం గ్రంధాలు చదువుకోవాలన్నా వెలుగు కావాలి. అలానే సద్గురువుయొక్క చర్యలు విరజిమ్మే వెలుగులో మనం చదివే శాస్త్రాలు మనకు సరిగా అర్థం అవుతాయి.

అంతేకాదు, ఒకే వెలుగులో ఒకే శాస్త్ర గ్రంథాన్ని నలుగురు చదువుకుంటే అది వారిలో ఒక్కొక్కరికీ ఒకొక్కవిధంగా అర్థం అవుతుంది. అది సంపూర్ణంగా అర్థం అవ్వాలంటే నిరంతర సద్గురు సేవవలన మన మనస్సు ప్రబుద్ధం కావాలి. లోజూపు అనే జ్ఞానజ్యోతి వెలగాలి.

ఒకరోజు ఒకామె జామపండ్లమ్ముతోంది. సాయి ఆమెను పిలచి బేరమాడారు. పట్టుబట్టి పదణాలకు (అరవైపైసలకు) ఆరు పండ్లు యివ్వడానికి ఆమెను వొప్పించారు. ఇంతలో యింకొకామెకూడా జామపండ్లను తెచ్చి సాయిని కొనమని కోరింది. సాయి ఆమెతో బేరమాడి ఆరు అణాలకు (ముప్షై ఆరు పైసలు) పది పండ్లు యివ్వమన్నారు. ఆ యిద్దరివద్ద పండ్లు తీసుకుని యిద్దరికీ చెరొక రూపాయి యిచ్చి పంపారు!

సాయి వారిద్దరితో బేరమాడుతుంటే చూచిన భక్తులు మొదట ఆయనెంత పిసినారో అని తలచి ఆశ్చర్యపోయారు. ఆయన చెరొక రూపాయి యిచ్చేసరికి మరింత ఆశ్చర్యపోయి కారణమడిగారు. " మొదటి స్త్రీ పండ్లు తెచ్చినప్పడు ఆమెవద్ద తప్ప పండ్లు దొరకకపోవడం వలన వాటికావెల నిర్ణయించబడింది. రెండవామె పండ్లు తెచ్చేసరికి పండ్లు అధికంగా దొరుకుతున్నాయి గనుక వాటికి ఆవెల నిర్ణయించబడింది గానీ, చివరకు వారిద్దరూ వారి పుణ్యాన్ని అనుసరించి ప్రతిఫలాన్ని పొందారు" అన్నారు సాయి.

సాయి చర్యలన్నిటిలోలాగే ఇందులోగూడా తెలుసుకున్న వారికి తెలుసుకున్నంత జ్ఞానమున్నది. మొదటి స్త్రీ సాయివద్ద సాధ్యమైనంత డబ్బును లాభంగా పొందాలని మాత్రమే వచ్చింది. అందుకే అంత బేరమాడింది. రెండవ స్త్రీ సాయి మహాత్ములని, కనుక ఆయనకోరిన వెలకు పండ్లివ్వాలని , ఆయనిచ్చిన పైకం ప్రసాదమేనని తలచింది. అందుకే ఆ బేరానికి ఒప్పకున్నది. భక్తులందరిపైన సాయి అనుగ్రహం ఒకలాగానే ఉంటుంది. కాని ఎవరి శ్రద్ధనుబట్టి

పారంతే పొందుతారు. బేరం దృష్ట్యా చూస్తే మొదటి స్త్రీకి లాభం తక్కువ. ఆమె కోరిన వెలకంటే అదనంగా ఆమెకు లభించింది నలభైపైసలే. రెండవ స్త్రీ పొందినది ఎక్కువ, ఆమెకు అరవై నాలుగు పైసలు ఎక్కువ.

ఈ లీల యింకా విశాలమైన సూక్ష్మాన్ని తెల్పుతుంది. భగవంతుని మానవులు నాలుగు విధాలుగా ఆశ్రయిస్తారు. కష్టాలను తొలగించమనేవారు, కోరికలు తీర్చమనే వారూ, ఆయన మహిమలు తెలుసుకోదలచినవారు, పూర్ణమైన జ్ఞానాన్ని మాత్రమే కోరేవారు. అంటే మొదటి రెండు రకాలైన వారూ లౌకిక ప్రయోజనాన్ని మాత్రమే కోరుతారు. తరువాతి రెండు రకాలవారూ ఆయన అనుగ్రహ రూపమైన, పరమార్థాన్నే కోరుతారు. మొదటి రకం వారికి స్వప్రయోజనంపై ప్రీతి ఎక్కువ. రెండవ రకం వారికి భగవంతుని మీదనే ప్రీతి ఎక్కువ. పై లీలలోని యిద్దరు స్త్రీలు ఈ రెండు వైఖరులకూ ప్రతినిధులు, భక్తులందరికీ భగవంతుడు - వారు తన్నెందుకు ఆశ్రయించినా - యిహ - పరాలను అనుగ్రహిస్తారు. కొందరు భక్తులు అజ్ఞానము వలన లౌకిక శ్రేయస్సును మాత్రమే స్వీకరిస్తారు. వివేకులు ఆయనపట్ల భక్తి వలన ఆయన యిచ్చిన యిహ-పరాలు రెండింటినీ పొందగలుగుతారు.

అంతేకాదు, చేసిన పనికి, యిచ్చిన వస్తువుకీ వెలను మాత్రమే చెల్లిస్తారు మానవులు. అందులో గూడా సాధ్యమైనంత బేరమాడి వీలైనంత తక్కువ ధరను చెల్లింపచూస్తారు.

భగవంతుడు తన అనుగ్రహాన్ని నిర్హేతుకంగా జీవులకు ప్రసాదిస్తాడు. అంటే మన చేతలద్వారా, సాధనద్వారా మనము సాధించుకోగలిగేది కాదు భగవదనుగ్రహము. మనమేమీ చేయకున్నా గాలి, నీరు, వెలుగులను ఆయన అందరికీ ప్రసాదిస్తూనే ఉన్నారు. పనిచేయగల దేహాన్ని, మనస్సునూ ప్రసాదించాడు. మనము తెలుసుకోగలగాలేగానీ అపారమైన జ్ఞానాన్ని, దివ్యశక్తినీ మనలో పొందుపరిచాడు. మనలను ప్రభోదించడానికి శాస్త్రాల రూపంలోనూ, మహాత్ముల రూపంలోనూ నిరంతరము ఆయన కృషి చేస్తూనే వున్నాడు. సాధన అంతా ఈ వాస్తవాన్ని గుర్తించి మన దృష్టిని, జీవిత విధానాన్నీ సరిచేసుకొనడమే.

ఈ లీలలో మొదటి స్త్రీ రెండవామెను చూచి అసూయపడనక్కరలేదు. భగవంతుడు యిద్దరికీ సమానంగానే యిచ్చాడు. లోపం అంతా తమ దృష్టిలోనిదే. తనకు రావలసినది రెండవామెకు చెందితేగదా ఆమె బాధపడాలి? సాటివారికి సాయినాధుడు అనుగ్రహించిన జ్ఞానానికి, అనుభవాలకూ అసూయచెందనవసరంలేదు. నిర్హేతుకమైన ఆయన దయకు కృతజ్ఞులమవగలిగితే చాలు.

---

# Annadanam List

| | | |
|---|---|---|
| 1. K. Nagarathamma | - Gooty | - Rs. 1343.00 |
| 2. Sri Hima Bindu | - Vijayawada | - Rs. 1343.00 |
| 3. M. Rama Rao | - Nadipudi (East Godavari) | - Rs. 2700.00 |
| 4. G. Balaji Nageswara Rao | - Vishakhapatnam | - Rs. 2000.00 |
| 5. R. Prathakaraiah | - Hosur (Tamil Nadu) | - Rs. 1343.00 |
| 6. K. Chandrasekhara Rao | - Guntur | - Rs. 2000.00 |
| 7. S. Gopala Krishna | - Kadapa | - Rs. 1343.00 |
| 8. N. Venkata Buchhi Ramakrishna Rao | - Eluru | - Rs. 1343.00 |
| 9. K. Sivakesava Rao garu | - Eluru | - Rs. 1343.00 |
| 10. M. Chakradhara Rao | - Eluru | - Rs. 1343.00 |
| 11. K. Krishna Veni | - Hyderabad | - Rs. 1343.00 |
| 12. D. Suvarna | - Hyderabad | - Rs. 1343.00 |
| 13. M. Aruna Priya | - Visakhapatnam | - Rs. 1350.00 |
| 14. M. Venkata Laxmi Narayana | - Ongole | - Rs. 1343.00 |
| 15. N.V.S.S. Kishore | - Gudur | - Rs. 1343.00 |
| 16. R. Kesavulu | - Hyderabad | - Rs. 1343.00 |
| 17. K. Sakuntalamma<br>H. Raghavendra Rao | - Chennai | - Rs. 1343.00 |
| 18. S.A. Vamshish Gupta | - Bangalore | - Rs. 2100.00 |
| 19. P. Padmaja | - Gudiwada | - Rs. 1343.00 |
| 20. P. Anasuya Devi | - Visakhapatnam | - Rs. 1343.00 |
| 21. S. Sudhakar Reddy | - Perembedu (Tamil Nadu) | - Rs. 1343.00 |
| 22. Raja and Manju Yadav | - Lakampur-Kheri | - Rs. 1350.00 |

# School List

| | | |
|---|---|---|
| 1. G. Brahmaiah | - Chirala | - Rs. 500.00 |
| 2. D.Venkateswaru | - Chirala | - Rs. 1000.00 |
| 3. G. Brahmaiah | - Chirala | - Rs. 500.00 |

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 40-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 10-00 |
| విజ్ఞాన వీచికలు | 40-00 |
| పరిప్రశ్న | 35-00 |
| మతమెందుకు? | 20-00 |
| ఏది నిజం? | 25-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 33-00 |
| బుద్ధధ్యాన హృదయం | 20-00 |
| దత్తావతార మహత్మ్యం | 30-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 80-00 |
| పురుషసూక్త రహస్యం | 20-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 45-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 15-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 20-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 40-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 25-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 30-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 35-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 30-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 55-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |
| గురుశుశ్రూష | 199-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 50-00 |
| Supreme Master (Swami Samartha) | 50-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 25-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham (Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |

SRI GURUPADUKA PUBLICATIONS
MangaMoor Road, Ongole-2, Ph: 08592-233271
www.saibharadwaja.org
www.saimasterforums.com